కూటమి ప్రభుత్వ 15 నెలల పాలనలలో ప్రజా సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేశాం. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి సూపర్ హిట్ చేసింది. కూటమి ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని, వైసీపీ ఫేక్ ప్రచారానికి తెర లేపింది. ప్రజల్లో ఆందోళనలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం వైసీపీ దిగజారుడు తననానికి నిదర్శనం.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



మంగళవారం 09.09.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 144 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




పెట్టుబడుల ఆకర్షణకే 99 పైసలకే భూమి టిసిఎస్ ద్వారా 25వేల ఉద్యోగాలు

ట్రంప్ సుంకాల నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్కెట్లను వెదుక్కుంటాం

ప్రతీకార రాజకీయాలు చేయం...

తప్పు చేస్తే నన్నయినా చంద్రబాబు వదలరు

ఇండియా టుడే కాంక్లేవ్ లో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్

# పరిశ్రమలకు ప్రోత్సాహం



**కోయంబత్తూరు:** ఆంధ్రప్రదేశ్ కు చంద్రబాబు నాయుడు అనే బ్రాండ్ అంబాసిడర్ ఉన్నారు, ఆ బ్రాండ్ తోనే దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్, డాటా సెంటర్లు, ఐటి కంపెనీలు ఎపిలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి, ఎపిలోని పరిశ్రమ అనుకూలమైన వాతావరణం కూడా పెద్దఎత్తున పరిశ్రమల రాకకు ప్రధాన కారణమని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కోయంబత్తూరులో "ఎట్రాక్టింగ్ ఇన్వెస్టిమెంట్ ఫర్ ద సన్ రైజ్ స్టేట్" అనే అంశంపై ప్రముఖ మీడియా సంస్థ ఇండియా టుడే నిర్వహించిన కాంక్లేవ్ లో మంత్రి లోకేష్ రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు గత 15నెలలుగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సీనియర్ జర్నలిస్టు రాజ్ దీప్ సర్దేశాయ్ సంధానకర్తగా వ్యవహరించారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... గత ఎన్నికల్లో మేం ఇచ్చిన సూపర్ -6 హామీల్లో ప్రధానమైనది యువతకు 20లక్షల ఉద్యోగాల కల్పన. ఆ లక్ష్యసాధన కోసం మేం ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నాం. టిసిఎస్ సంస్థ 25వేల ఉద్యోగాలు కల్పిస్తుంది... ఆ సంస్థకు 99పైసలకే భూమి కేటాయిస్తే తప్పేమిటి కర్నాటక, తమిళనాడు, కేరళ, యుపి వంటి రాష్ట్రాలతో పోటీపడి పరిశ్రమలను రప్పించడానికే తక్కువ ధరకు భూమి, ఇతర రాష్ట్రాల కంటే మెరుగైన ప్రోత్సాహకాలు అందిస్తున్నాం.

**ఆక్వా ప్రత్యామ్నాయ మార్కెట్ వెదుక్కుంటాం :** హైదరాబాద్ లో ఎయిర్ పోర్టు నిర్మాణానికి 5వేల ఎకరాలు ఎందుకని అప్పట్లో చాలామంది రాజకీయ ప్రత్యర్థులు విమర్శలు చేశారు, ఈరోజు శంషాబాద్ ఎయిర్ పోర్టు దేశంలోనే అత్యుత్తమ పోర్టుల్లో ఒకటిగా ఉంది. తెలంగాణా రాష్ట్రానికి ప్రధాన ఆదాయవనరుగా మారింది.

మిగతా 2లో...

## రాష్ట్రానికి సమృద్ధిగా యూరియా



- ఏపీలో 80 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు
- యూరియా సరఫరాపై కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో ఫోన్లో మాట్లాడిన సీఎం
- కాకినాడ పోర్టుకు వచ్చిన నౌకలో 7 రేక్ ల యూరియా కేటాయింపు
- రబీ సీజన్ కు కూడా ముందస్తు ప్రణాళిక చేయాలన్న ముఖ్యమంత్రి
- సీఎం కృషితో 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా అదనపు కేటాయింపు
- రాష్ట్రంలో యూరియా సరఫరాపై జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులతోనూ సీఎం టెలికాన్ఫరెన్సు.
- యూరియాతో పాటు వివిధ అంశాలపై మొత్తం 5 గంటల పాటు అధికారులతో సమీక్షించిన ముఖ్యమంత్రి

2 లో



## అన్నామలైతో మంత్రి లోకేష్ భేటీ


**కోయంబత్తూరు:** తమిళనాడు రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలైని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ కోయంబత్తూరులో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. డబుల్ ఇంజన్ సర్కారు అధికారంలో ఉన్నందున ఏపీ వేగవంతంగా అభివృద్ధి సాధిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, విద్యారంగంలో తాము చేపడుతున్న సంస్కరణలు దేశంలోనే రోల్ మోడల్ గా నిలుస్తున్నాయని చెప్పారు. ఒకసారి ఆంధ్రప్రదేశ్ ను సందర్శించాల్సిందిగా అన్నామలైని లోకేష్ ఆహ్వానించారు.

## ఎప్పుడైనా, ఎక్కడైనా మీ ఇష్టం

మెడికల్ కాలేజీలపై బహిరంగ చర్చకు సిద్ధం

ప్రజల ముందే నిజం తేల్చుకుందాం

వైసీపీకి వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ సవాల్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తున్నారంటూ వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు పచ్చి అబద్ధాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. పీపీపీ విధానం అంటే ప్రైవేటుపరం కాదని, కాలేజీల యాజమాన్యం, నియంత్రణ రాష్ట్ర ప్రభుత్వానిదే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విధానం వల్ల నిర్మాణం వేగవంతం అవుతుందని, ప్రతి కాలేజీలో కనీసం 150 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని మంత్రి వివరించారు. "ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు వైసీపీ కావాలనే విషప్రచారం చేస్తోంది" అని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. వైసీపీ చేస్తున్నది తప్పుడు ప్రచారం అని... "మెడికల్ కాలేజీలపై చర్చకు సిద్ధం... ఎప్పుడైనా, ఎక్కడైనా మీ ఇష్టం," అని మంత్రి సత్యకుమార్ సవాల్ విసిరారు..

మిగతా 2లో...

**వైసీపీ తప్పుడు ప్రచారం :** మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ "జగన్ హయాంలో ప్రారంభించని, పూర్తి చేయని కాలేజీలను మేము ఎలా ప్రైవేటుపరం చేస్తాం? పీపీపీ విధానాన్ని వక్రీకరించి ప్రజల్లో తప్పుడు అభిప్రాయం కలిగించే ప్రయత్నం

## విద్యార్థుల్లో హింసా ప్రవృత్తిని ఉపేక్షించం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** నూజివీడు ఆర్జియుకెటి ప్రొఫెసర్ గోపాలరాజుపై విద్యార్థి వినరు పురుషోత్తం దాడిని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిబంధనల మేరకు వినరును ప్రాక్టికల్ పరీక్షలకు గోపాలరాజు అనుమతించలేదని పేర్కొన్నారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో గురువులది కీలక స్థానమని, విద్యార్థి జీవితాన్ని పాడు చేయాలని ఏ అధ్యాపకుడు భావించరని తెలిపారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ లేమి, హింసా ప్రవృత్తిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు.

## ఎంజేపీ స్కూల్స్ కి డిమాండ్



**పెనుకొండ/శ్రీసత్యసాయి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో బీసీ విద్యార్థుల కోసం నాణ్యమైన విద్య అందించడంలో ఎంజేపీ స్కూల్స్ కార్పొరేట్ స్కూల్స్ కంటే ఎక్కువ గుర్తింపు పొందుతున్నాయి. టెన్త్, ఇంటర్ ఫలితాలలో ఉత్తమ సాధనతో, బీసీ బిడ్డలకు ఆరోగ్య భద్రతతో కూడిన విద్య అందించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. ఈ క్రమంలో పెనకొండలోని రొద్దం-2 ఎంజేపీ స్కూల్లో స్మార్ట్ పే ఫోన్లను ప్రారంభించి, రాష్ట్రంలోని 110 ఎంజేపీ స్కూల్స్‌లో 700కి పైగా ఫోన్లు ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. ఒక్కో విద్యార్థికి ప్రత్యేక స్మార్ట్ కార్డు కేటాయించబడతుందని, ఈ ఫోన్ల ద్వారా తల్లిదండ్రులు, బంధువులతో విద్యార్థులు సులభంగా మాట్లాడగలుగుతారని చెప్పారు. మంత్రి సవిత వివరించినట్టు, విద్యార్థుల శ్రేయస్సుకు నాణ్యమైన భోజనం, శుభ్రతా సౌకర్యాలు, విద్యుత్ ఇన్వర్టర్లు, ఆర్వో ప్లాంట్లు, కంప్యూటర్ ల్యాబ్‌లు, ఫ్యాన్లు, ట్రంకులు, బ్లాంకెట్లు వంటి అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, తల్లిదం డ్రులు, బంధువులు, ఉపాధ్యాయులు మానసిక క్షోభకు గురికావద్దని సూచిం చారు. స్మార్ట్ పే ఫోన్ల ప్రారంభంతో తల్లిదండ్రులు తమ పిల్లలతో నేరుగా మాట్లాడే అవకాశం కలిగి, విద్యార్థుల ఫోకస్ కూడా చదువుపై మరింత పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ చైర్మన్, నియోజకవర్గ పరిశీల కులు, కూటమి నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ప్రత్యక్ష ప్రసారాలు ప్రారంభించిన గవర్నర్

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర సమాచార కమిషన్ రెండవ అప్పీళ్లు, ఫిర్యాదుల విచారణల ప్రత్యక్ష ప్రసారాన్ని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ సోమవారం రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, విచారణల ప్రత్యక్షప్రసారం కమిషన్ పనితీరులో పారదర్శకత పెంచేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సమాచార కమిషన్ కృషిని ఆయన అభినందించారు. కేంద్ర సమాచార కమిషన్ ప్రధాన సమాచార కమిషనర్ హీరాలాల్ సమారియా, న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ రాష్ట్ర సమన్వయకర్త, శాస్త్రవేత్త-జి ఆర్.కె. పాఠక్, గవర్నర్ ఇ.ఓ. కార్యదర్శి ఎం. హరి జవహర్‌లాల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర సమాచార కమిషనర్ ఆర్. మహబూబ్ బాషా కమిషన్ కార్యాలయం నుండి ప్రత్యక్షప్రసారం ద్వారా ఈ కార్యక్రమంలో భాగమయ్యారు.

## ఫలించిన చంద్రబాబు కృషి

- రాష్ట్రానికి మరో 50,000 మెట్రిక్ టన్నుల యూరియా
- రైతాంగం తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర రైతుల కోసం ఎరువుల సరఫరాలో మరో ఊరట. కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్రానికి 50,000 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించబడటంతో రైతులు హర్షోద్గారాలు వ్యక్తం చేస్తున్నారు. రైతు సంఘాలు ఈ విజయానికి కారణం చంద్రబాబు నాయుడు చేసిన విశేష కృషి అని ప్రత్యేకంగా ప్రశంసలు వ్యక్తం చేశారు. వివరాల ప్రకారం, యూరియా వినియోగం ఎక్కువగా ఉండే సెప్టెంబర్ మాసానికి అధిక మొత్తంలో ఎరువులు రాష్ట్రానికి చేరుతున్నాయి. గత ఆగస్టు నెలలో కేటాయించిన 81,000 మెట్రిక్ టన్నుల యూరియాకు అదనంగా ఈ 50,000 మెట్రిక్ టన్నులు కేటాయింపయ్యాయి. ఈ సరఫరా ద్వారా సన్న, చిన్న కారు రైతులు, కౌలు రైతులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా పంటలకు అవసరమైన ఎరువును అందుకోగలుగుతున్నారు. రాష్ట్రానికి రాబోయే యూరియా సరఫరా రెండు రోజుల్లో కాకినాడ, విశాఖ, మంగళూరు, జైగర్ పోర్ట్‌లకు చేరనుంది. అక్కడినుంచి రైల్వే గూడ్స్ రేకుల ద్వారా రైతు కేంద్రాలకు పంపిణీ చేయబడుతుంది. ఈ పునర్వ్యవస్థపై కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన నాయుడు ప్రత్యేక దిశానిర్దేశం చేశారు. ఆయన ఎరువుల సరఫరా సమయం,

మిగతా 2లో...

## విశాఖ అభివృద్ధికి రూ.553 కోట్లతో ప్రాజెక్ట్



- ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో జీవీఎంసీ-ఐఎఫ్‌సీ మధ్య కుదిరిన ఒప్పందం
- దేశంలో ఐఎఫ్‌సీ రుణం పొందిన తొలి కార్పొరేషన్‌గా జీవీఎంసీ రికార్డ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** విశాఖ నగరాభివృద్ధి కోసం అంతర్జాతీయ ఆర్థిక సంస్థ నుంచి విశాఖపట్నం మహానగర పాలక సంస్థ రుణం తీసుకునేందుకు సంబంధించి ఐఎఫ్-సీ-జీవీఎంసీ అధికారులు మధ్య ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఒప్పందం జరిగింది. అనంతరం జీవీఎంసీ అధికారులు ముఖ్యమంత్రితో సమావేశమై త్వరలో చేపట్టే అభివృద్ధి ప్రాజెక్టు

మిగతా 2లో...



## వైసిపి ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావాలి

**అనకాపల్లి (జర్నలిస్ట్ ఫైల్):** వైసిపి ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు. సోమవారం అనకాపల్లిలో స్పీకర్ అయ్యన్న మాట్లాడుతూ అసెంబ్లీలో అందరు ఎమ్మెల్యేలలాగే మాట్లాడేందుకు వైసిపి ఎమ్మెల్యేలకు కూడా సమయం ఇస్తామని అన్నారు. అన్ని సమస్యలపై చర్చించేందుకు సమయం ఇస్తామని, వైసిపి ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావాలి అని స్పష్టం చేశారు.

# ఎప్పుడైనా, ఎక్కడైనా మీ ఇష్టం

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారు. ఇది అసలు సరైన పద్ధతి కాదు" అని నిలదీశారు. పీపీపీ మోడల్ వల్ల నిర్మాణాలు త్వరగా పూర్తవడంతో పాటు వైద్య విద్య మరింత మందికి అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ప్రభుత్వంపై ఆర్థిక భారం తగ్గి, విద్యార్థులకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు అందుతాయని స్పష్టం చేశారు.

**జగన్ హయాంలో అర్థాంతరంగా ఆగిపోయిన ప్రాజెక్టులు :** జగన్ హయాంలో మెడికల్ కాలేజీల నిర్మాణం అర్థాంతరంగా ఆగిపోయిందని మంత్రి తీవ్రంగా ఎద్దేవా చేశారు. మార్కాపురం కాలేజీ కేవలం 17 శాతం, మదనపల్లె 12 శాతం, పులివెందుల 77 శాతం, ఆదోని 15 శాతం మాత్రమే పూర్తయ్యాయని వివరించారు. "17 కాలేజీలు తెచ్చానని చెప్పుకునే జగన్ ఒక్కదాన్నీ పూర్తి చేయలేకపోయారు. రూ. 8,500 కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేవలం 17 శాతం మాత్రమే ఖర్చు పెట్టారు. పైగా విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలో హాస్టళ్లు లేకుండా, సిబ్బంది లేకుండా, పరిపాలన లేకుండా అరకొర వసతులతో కాలేజీలు నడిపారు" అని మంత్రి సత్యకుమార్ దుయ్యబట్టారు.

**కూటమి ప్రభుత్వ చర్యలు :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే కాలేజీ ప్రాజెక్టులు మళ్లీ పట్టాలు ఎక్కాయని మంత్రి గుర్తుచేశారు. 2024-25లో పాడేరులో మెడికల్ కాలేజీని ప్రారంభించామని తెలిపారు. మార్కాపురం, ఆదోని, మదనపల్లె, పులివెందుల, నర్సీపట్నం, అమలాపురం, పాలకొల్లు, బాపట్ల, పెనుకొండ కాలేజీల నిర్మాణం వేగవంతం చేశామని వివరించారు. మొదటి దశలో ఆదోని, మార్కాపురం, మదనపల్లె, పులివెందుల కళాశాలలను పూర్తి చేస్తామని, రెండో దశలో అమలాపురం, నర్సీపట్నం, పాలకొల్లు, బాపట్ల, పెనుకొండ, పార్వతీపురం కాలేజీలను పూర్తి చేస్తామని తెలిపారు. "ప్రతి కాలేజీ 420 పడకల ఆసుపత్రితో పాటు ప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగా ఏర్పాటవుతుంది. తర్వాత ఈ ఆసుపత్రులు ప్రభుత్వానికే అప్పగిస్తాం" అని మంత్రి స్పష్టం చేశారు.

**పేదలకు ఉచిత వైద్య సేవలు :** పీపీపీ మోడల్‌లో నిర్మించే ఆసుపత్రుల్లో పేదలకు పూర్తి స్థాయి వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని మంత్రి భరోసా ఇచ్చారు. "ఓపీ పూర్తిగా ఉచితం. ఇన్‌పేషెంట్ సేవల్లో 70 శాతం పడకలు పీఎంజేఏవై, ఎన్టీఆర్ వీఎస్టీ, సీజీహెచ్ఎస్ వంటి పథకాల కింద ఉచితం. రోగులకు జనరిక్ మందులు కూడా ఉచితంగానే ఇస్తున్నాం" అని చెప్పారు. ఈ విధానం వల్ల పేదలకు ఎలాంటి భారం లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని స్పష్టం చేశారు.

**వైసీపీకి మంత్రి సవాల్ :** వైసీపీ నేతలు తప్పుడు ప్రచారంతో ప్రజలను మభ్యపెడుతున్నారని మంత్రి సత్యకుమార్ ధ్వజమెత్తారు. "జగన్ పూర్తి చేయని కాలేజీలను మేము ప్రైవేటుపరం చేస్తామన్నది పచ్చి అబద్ధం. ప్రజలను తప్పుదారి పట్టించడం మానేయాలి. మెడికల్ కాలేజీల అంశంపై ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు సిద్ధం. మీరు సిద్ధమా?" అని వైసీపీకి బహిరంగ సవాల్ విసిరారు.

# ఫలించిన చంద్రబాబు కృషి

(మొదటి పేజీ తరువాయి)


రైల్వే మార్గాల సమన్వయం, మరియు రాష్ట్ర రైతులకు ఎటువంటి ఇబ్బంది రాకుండా ఏర్పాట్లను ప్రత్యేకంగా పర్యవేక్షించారు. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పత్రికా ప్రకటనలో, యూరియా సరఫరా సంక్షోభ సమయంలో రాష్ట్ర రైతుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా ప్రత్యక్ష చర్యల్లోకి దిగి, కేంద్ర ప్రభుత్వంతో, ముఖ్యంగా కేంద్ర ఎరువుల రసాయనిక శాఖతో ప్రత్యేక చర్చలు జరిపి రాష్ట్ర రైతుల అవసరాలను పూరించినట్టు తెలిపారు. రైతుల తరుపున ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వివరాల ప్రకారం, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ద్వారా కాకినాడకు 17,294 మెట్రిక్ టన్నులు, ఇండియన్ పొటాష్ లిమిటెడ్ ద్వారా మంగళూరు 5,400 మెట్రిక్ టన్నులు, నర్మదా కంపెనీ ద్వారా జైగర్ 10,800 మెట్రిక్ టన్నులు, నేషనల్ ఫెర్టిలైజర్స్ ద్వారా విశాఖకు 15,874 మెట్రిక్ టన్నులు రాబోవు రెండు రోజుల్లో రాష్ట్రానికి చేరనున్నాయి. దీనితో రాష్ట్రానికి లభించే మొత్తం 50,000 మెట్రిక్ టన్నుల కేటాయింపు ఆగస్టు నెలకు కేటాయించిన 81,151 మెట్రిక్ టన్నుల అదనంగా ఉంటుంది. ఇప్పటికే 41,183 మెట్రిక్ టన్నుల యూరియా రైతు సేవ కేంద్రాలకు పంపిణీ అయి చేరింది. మిగిలిన 40,968 మెట్రిక్ టన్నులు రవాణాలో ఉన్నాయి. రైతులు ధైర్యంగా ఉండాలని, ఎటువంటి కొరత లేదని మంత్రి సూచించారు. యూరియాను శాస్త్రీయంగా, తక్షణ అవసరాలకు అనుగుణంగా మాత్రమే వినియోగించాల్సినదని, ఎరువుల వినియోగంపై గ్రామ స్థాయిలో అవగాహన కల్పించడానికి క్షేత్ర సిబ్బంది ఔట్ రీచ్ కార్యక్రమాలు నిర్వహించాల్సిందని సూచించారు.

# విశాఖ అభివృద్ధికి రూ.553 కోట్లతో ప్రాజెక్ట్

(మొదటి పేజీ తరువాయి)

వివరాలను వెల్లడించారు. ఈ ఒప్పందంతో భారతదేశంలో మొదటిసారిగా అంతర్జాతీయ ఆర్థిక సంస్థ నుంచి ప్రత్యక్ష రుణం పొందిన మున్సిపల్ కార్పొరేషన్‌గా జీవీఎంసీ నిలిచిందని అధికారులు తెలిపారు. విశాఖపట్నంలోని మధురవాడ జోన్-2లో ఆధునిక మురుగునీటి వ్యవస్థను ప్రాజెక్టులో భాగంగా అభివృద్ధి చేయనున్నారు. దీనికి మొత్తం రూ. 553 కోట్లు వ్యయం అయ్యే ఈ ప్రాజెక్టులో రూ. 498 కోట్లు ఐఎఫ్‌సీ రుణంగా ఇవ్వనుంది. మిగిలిన మొత్తంలో అమృత్ 2.0 నుంచి రూ. 45.64 కోట్లు, జీవీఎంసీ సొంత నిధులు రూ. 9.36 కోట్లు వినియోగించనుంది. జీవీఎంసీ తన సొంత ఆదాయ వనరుల ద్వారా ఈ రుణాన్ని తిరిగి ఐఎఫ్‌సీకి చెల్లించనుంది. 15 సంవత్సరాల కాలపరిమితి కలిగిన ఈ రుణానికి వడ్డీ రేటు 8.15 శాతం (ఫ్లోటింగ్)గా నిర్ణయించారు. త్వరలో మొదలయ్యే మధురవాడ మురుగునీటి ప్రాజెక్టుతో 100 శాతం అండర్‌గ్రౌండ్ మురుగునీటి నెట్‌వర్క్, ఆధునిక పంపింగ్ - లిఫ్టింగ్ స్టేషన్లు, అత్యాధునిక శుద్ధి కేంద్రం - నీటి పునర్వినియోగం, రీసైక్లింగ్ చేయనున్నారు. 30 ఏళ్ల జనాభా వృద్ధి అవసరాలను దృష్టిలో పెట్టుకొని దీనిని డిజైన్ చేశారు. నీటి శుద్ధి వల్ల వ్యాధులు తగ్గడంతో పాటు, భూగర్భజలాలు కలుషితం కావు, పర్యావరణానికి మేలు చేస్తుంది. వరద నీటి నిర్వహణ సాధ్యమవుతుంది. ఈ ప్రాజెక్టు పరిధిలో నివసిస్తున్న రెండున్నర కోట్ల మందికి ఉపయోగకారిగా ఉంటుంది. ఈ ఒప్పందం ద్వారా భారతదేశంలో నగరాల ఆర్థిక స్వయంప్రతిపత్తికి కొత్త దారి చూపినట్టయ్యింది.

# ఉద్యోగుల అకౌంట్లలో భారీగా డబ్బులు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** సీపీఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. డీఏ బకాయిలు విడుదల చేసింది. మొత్తం ఆరు విడతల్లో బకాయిలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తొలి విడతలో డీఏ బకాయి ఒక్కో ఉద్యోగికి రూ. 70 వేల వరకు అకౌంట్లలో జమ అయింది. దీంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. డీఏ బకాయి విడుదల కోసం ప్రభుత్వాలకు చాలా సార్లు విజ్ఞప్తి చేశాం. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లామని కానీ పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ డీఏ పెండింగ్ బకాయిలు విడుదల అవుతున్నాయని తెలిపారు.

# పరిశ్రమలకు ప్రోత్సాహం

(మొదటి పేజీ తరువాయి)





విజనరీ లీడర్ చంద్రబాబునాయుడు ముందుచూపు వల్లే ఇది సాధ్యమైంది. ఎయిర్ ట్రాఫిక్ రద్దీని తట్టుకునేందుకు ఇప్పుడు బెంగుళూరులో రెండో ఎయిర్ పోర్టు నిర్మిస్తున్నారు. హైదరాబాద్ లో రాబోయే వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆనాడు చంద్రబాబుగారు సువిశాలంగా ఎయిర్ పోర్టు నిర్మాణం చేపట్టారని గుర్తుచేశారు. ట్రంప్ సుంకాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఆక్వా మార్కెట్ ను కాపాడుకునేందుకు ప్రభుత్వం తరపున మద్దతు ఇవ్వడమేగాక రష్యా, చైనా, యూరప్ లలో ప్రత్యామ్నాయ మార్కెట్ లు వెదుక్కుంటాం, సవాళ్లను అవకాశంగా తీసుకుంటామని మంత్రి లోకేష్ చెప్పారు. స్టాన్ ఫోర్డ్ లో చదువుతోపాటు యువగళం పాదయాత్ర సవాళ్లను ఎదుర్కొనే మార్గాలను నేర్పించిందని లోకేష్ తెలిపారు.

**రాధాకృష్ణన్ కే మా మద్దతు :** ఉప రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి భారత్ ఫస్ట్ అనే నినాదానికే మేం కట్టుబడి ఉన్నాం. దేశాన్ని ముందుండి నడిపించే నాయకత్వానికే మేం మద్దతు ఇవ్వాలని నిర్ణయించాం. గౌరవ ప్రధాని నరేంద్ర మోడీజీ నేతృత్వంలో ఎన్ డిఎ అభ్యర్థికి టిడిపి మద్దతు నిస్తుంది. ఎన్ డిఎ అభ్యర్థిగా రాధాకృష్ణన్ ను ప్రకటించగానే ఢిల్లీలో సిపిఆర్ గారిని కలసి అభినందించాం. ప్రధాని మోడీజీ నేతృత్వాన 2029 ఎన్నికల తర్వాత కూడా మా ప్రయాణం కొనసాగుతుంది.

**తప్పుచేస్తే ఎవరినీ క్షమించరు :** భారత్ మల్టీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా ఆవిష్కృతమవున్న తరుణంలో పారదర్శకమైన రాజకీయాలు అవసరమని మేం బలంగా విశ్వసిస్తున్నాం. రాజకీయనాయకులపై ఉన్న కేసులకు సంబంధించి ఏడాదిలోగా విచారణ పూర్తిచేసి, తీర్పు ఇవ్వాలని సుప్రీంకోర్టు గతంలో మార్గదర్శకాలు ఇచ్చింది. దురదృష్టవశాత్తు అది అమలు కావడం లేదు. ఆంధ్రప్రదేశ్ లో ఎవరినీ ఉద్దేశపూర్వకంగా జైలులో పెట్టాలని భావించడం లేదు. ఇదే సమయంలో తప్పుచేసిన శిక్ష అనుభవించక తప్పదు. చంద్రబాబు గారిని అక్రమంగా అరెస్టు చేశారని మేం ప్రతీకార రాజకీయాలు చేయబోం. నేను తప్పుచేసినా చంద్రబాబు గారు నన్ను జైలుకు పంపుతారు.

**మాకు ఎపి ప్రయోజనాలే ముఖ్యం :** మాకు ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రయోజనాలే ముఖ్యం. వారిపట్ల మాకున్న నిబద్ధత వల్లే గత 40ఏళ్లుగా వారి హృదయాల్లో చోటు కల్పించారు. తెలుగుదేశం పార్టీ మిగిలిన ప్రాంతీయ పార్టీలకంటే భిన్నమైంది. తరాలు మారినా మేమంతా కలసికట్టుగా ముందుకు సాగుతున్నాం. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో విజేతలైన వారిలో 50శాతం మంది తొలిసారి ఎన్నికైన ఎమ్మెల్యేలే. 25మంది మంత్రుల్లో 17మంది కొత్తవారు. మేము అంకితభావం కలిగిన కొత్తతరాన్ని రాజకీయాల్లోకి తెస్తున్నాం.

**వారు తిరస్కరించాకే మేం ఆహ్వానించాం :** మేము కొత్తగా ఏర్పడిన రాష్ట్రమైనప్పటికీ పెట్టుబడుల ఆకర్షణలో ఇతర అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో పోటీపడుతున్నాం. ఫార్చ్యూన్ 500 కంపెనీలతోపాటు ఇతర ప్రముఖ సంస్థలు ఎపి వైపు చూస్తున్నాయి. స్పేస్ సెక్టార్ అభివృద్ధికి ఇటీవల 200 ఎకరాల భూమి కేటాయించాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కు ఇది దోహద పడుతుంది. హిందుస్తాన్ ఏరోనాటిక్స్ సంస్థను కర్నాటక తిరస్కరించాకే మేం ఆహ్వానం పలికాం. ఎంఎస్ఎంఇ ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేసేందుకు మా మంత్రి దావోస్ లో పర్యటిస్తున్నారు. హ్యాండ్లూమ్స్, టెక్స్టైల్ రంగాలపై కూడా దృష్టిసారించాం.

**రైతుల అంగీకారంతోనే భూసమీకరణ :** అమరావతి నిర్మాణానికి రైతుల అంగీకారంతో 35వేల ఎకరాలను సమీకరించాం. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో అమరావతి రాజధాని నిర్మాణం చేపట్టాం. భారతదేశం అభివృద్ధికి అమరావతి లాంటి మరో వందనగరాల నిర్మాణం జరగాలి. 30ఏళ్లక్రితం హైదరాబాద్, సికింద్రాబాద్ తో పాటు సైబర్ నగర నిర్మాణం జరిగింది. అప్పట్లో కొందరు కంప్యూటర్ అన్నం పెడుతుందా అని అన్నారు. ఇప్పుడు ఐటిలో ఉద్యోగాలు చేస్తున్న లక్షలాది మంది బిడ్డలను చూస్తే కంప్యూటర్ జీవనోపాధికి ఎలా ఉపయోగపడుతుందో తెలుస్తుంది. అటువంటి సాహసోపేతమైన నిర్ణయం తీసుకోవడం చంద్రబాబు లాంటి విజనరీ లీడర్ కే సాధ్యమవుతుంది. జనవరిలో అమరావతికి దేశంలోనే మొట్టమొదటి 158 బిట్ క్వాంటమ్ కంప్యూటర్ రాబోతోంది. త్వరలో నైపుణ్యం పోర్టల్ ప్రారంభించబోతున్నాం, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి వర్టికల్, హారిజంటల్ గా చర్యలు చేపడతున్నామని లోకేష్ చెప్పారు.

# తురకపాలెం లో ఎంఎల్ఏ పల్లె నిద్ర



**ప్రత్తిపాడు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో పల్లె నిద్ర చేసిన స్థానిక ప్రత్తిపాడు శాసనసభ్యులు డా. బూర్ల రామాంజనేయులు. గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో ఇటీవల జరిగిన వరుస మరణాలపై ప్రభుత్వం అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తూ మెరుగైన వైద్యం, ఉచితంగా ఆహారం పంపిణీ, పరిశుద్ధమైన త్రాగునీరు సరఫరా చేస్తూ తగు నివారణ చర్యలు, జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రజలలో ఉన్న అపోహలు తొలగిపోవడానికి, గ్రామంలో సాధారణ పరిస్థితులు నెలకొల్పటానికి సోమవారం నాడు ప్రత్తిపాడు నియోజవర్గ శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు మరియు ప్రజాప్రతినిధులతో కలిసి తురకపాలెం గ్రామంలోని ఎస్సీ కాలనీ, బీసీ కాలనీలలో మరియు గ్రామంలో అందరితో సమావేశాలు జరిపి వారికి ధైర్యాన్ని, స్థైర్యాన్ని నింపి వారితో కలిసి సహపంక్తి భోజనం చేసి అనంతరం అక్కడే బస ఏర్పాటు చేసుకొని పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ తురకపాలెం లో జరుగుతున్న సంఘటనలు వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి, పార్లమెంట్ సభ్యులు పెమ్మసాని చంద్రశేఖర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం కావడానికి ఎప్పటికప్పుడు రెవిన్యూ అధికారులు, వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ గ్రామంలో అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. చాలావరకు సమస్యను పరిష్కరించామని, ప్రత్యేక ప్రణాళికతో రాబోయే రోజుల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా పారిశుద్ధ చర్యలు, తాగునీటికి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎప్పటికప్పుడు వైద్యపరమైన పర్యవేక్షణ కొనసాగుతుందని కానీ కొంతమంది వైసిపి నాయకులు లేనిపోని అపోహలు సృష్టించి ప్రజలలో గందరగోళ్ల పరిస్థితులు నెలకొల్పుతున్నారన్నారు. వారు ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చూసి ఓర్వలేక రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఇటువంటి ప్రచారాల్ని ప్రజలు తిప్పి కొట్టాలని ప్రజలకు అండగా ప్రభుత్వం ఎప్పుడూ పనిచేస్తుందని అన్నారు. అటువంటి అపోహలను ప్రజలకు దూరం చేయటానికి ప్రజలతో మమేకమై పల్లెనిద్ర చేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జనసేన మరియు కూటమి నాయకులు మరియు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# చంద్రబాబు పాలనలో అభివృద్ధి - జగన్ పాలనలో కేవలం అవినీతి, అబద్ధాలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** సాక్షి పత్రికలో మెడికల్ కాలేజీలపై వచ్చిన అబద్ధాలను మాజీ ఎమ్మెల్సీ, తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు సోమవారం మంగళగిరి ఎన్టీఆర్ భవన్‌లో ఘర్షణాత్మకంగా ఖండించారు. వైసీపీ ప్రతి అంశంలో విష ప్రచారం చేస్తూ ప్రజలను మోసిపోతున్నదని, అసలు పని లేకుండా అబద్ధాలు ప్రచురిస్తున్న పార్టీగా మారిందని ఆయన విమర్శించారు. ప్రజలు వాస్తవాలను తెలుసుకుంటారని, చంద్రబాబు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలవుతున్నాయని, జగన్ పాలనలో కేవలం అవినీతి, అబద్ధాలు మాత్రమే మిగిలాయని ఆయన స్పష్టపరచారు.

అశోక్ బాబు వివరాల ప్రకారం, చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న 2014-19 కాలంలో ఉమ్మడి రాష్ట్రంలో 27 మెడికల్ కాలేజీలు ఏర్పాటయ్యాయి. అందులో 11 కొత్త కాలేజీలు (6 ప్రైవేట్, 5 ప్రభుత్వ రంగం) ప్రారంభించబడ్డాయి. మెడికల్ కాలేజీ కేవలం బోర్డు మాత్రమే కాదు, హాస్పిటల్స్, బెడ్స్, ల్యాబ్స్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ అన్నీ ఉండాలి. కానీ జగన్ పాలనలో కేంద్రం ఆమోదించిన 17 కాలేజీలకు మొత్తం రూ. 8,480 కోట్ల బడ్జెట్ ఉంచినా, ఆయన ప్రభుత్వం రూ. 465 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. ఫ్యాకల్టీ లేమితో మార్కాపురం, ఆదోని, మదనపల్లె, పాడేరు కాలేజీలను మెడికల్ కౌన్సిల్ తిరస్కరించింది.

అశోక్ బాబు గట్టి విమర్శలు చేస్తూ, "రాళ్లు వేసి బోర్డులు పెట్టి ప్రజలను మోసం చేయడం వైసీపీ అలవాటు. కొత్త ప్రాజెక్టులు చేయకుండా, టీడీపీ ప్రారంభించిన పనులకే తమ పేరు పెట్టి పబ్లిసిటీ దొంగిలిస్తున్నారు. రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ఘనత చంద్రబాబు పాలనలోనే సాధ్యమైంది. వైసీపీ పాలనలో ఆరోగ్యరంగం పూర్తిగా కూలిపోయింది. దమ్ముంటే జగన్ లెక్కలు చెప్పి ప్రజలకు చూపించాలి" అన్నారు.

# అన్నప్రసాద పథకానికి విరాళం



**శ్రీశైలం(జర్నలిస్ట్ ఫైల్):** శ్రీశైలం దేవస్థానం అన్నప్రసాద వితరణ పథకానికి భక్తులు విశేషంగా స్పందిస్తున్నారు. ఈ క్రమంలో కర్నూలుకు చెందిన వి. రాజశేఖరరెడ్డి సోమవారం రూ. 1,00,116 విరాళాన్ని అందజేశారు.

ఈ మొత్తాన్ని దేవస్థానం పర్యవేక్షకులు కె. శివప్రసాద్‌కు దాత స్వయంగా అందజేశారు. అనంతరం దాతకు దేవస్థానం తరఫున రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేసి సత్కరించారు.

అన్నప్రసాద వితరణ పథకానికి విరాళాలు అందజేయడం ద్వారా భక్తులు మహాదేవుని కృపకు పాత్రులు అవుతున్నారని దేవస్థానం అధికారులు తెలిపారు.

# ఏపాసికాన్-2025లో జీఎంసీ గుంటూరు పీజీ విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన

**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్) :** గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ గుంటూరు పీజీ విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ ఏపాసికాన్-2025 రాష్ట్రస్థాయి సదస్సులో నిర్వహించిన క్విజ్ పోటీలో రన్నరప్ స్థానం సాధించారు. ఈ విజయంతో కళాశాల రాష్ట్రవ్యాప్తంగా మరోసారి గుర్తింపు పొందింది.

డా. లోహిత, డా. కుసుమ వెంకట రాహుల్ రెడ్డి, డా. పరితాల లక్ష్మీ ప్రసన్న, డా. సనికొమ్ము మణి భరగవ్ రెడ్డి లతో కూడిన జట్టు పోటీలో ప్రతిభ కనబరిచి ఈ స్థానం దక్కించుకుంది. వారి విజయానికి శస్త్రచికిత్స విభాగం ప్రొఫెసర్, విభాగాధిపతి డా. వై. కిరణ్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఎం. గోవింద్ నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా. కె. నాగ సంతోష్ కుమార్, డా. వినయ్‌కుమార్ మార్గదర్శకత్వం కల్పించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, సహ విద్యార్థులు, సహచరులు విజేతలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేసి, వారి కృషి, నిబద్ధతను ప్రశంసించారు. జీఎంసీ ప్రిన్సిపాల్ డా. ఎన్. వి. సుందర చారి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. ఎస్. ఎస్. వి. రామణ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఏపాసికాన్-2025లో లభించిన ఈ గౌరవం జీఎంసీ గుంటూరు రాష్ట్రంలో శస్త్రచికిత్స విద్య, శిక్షణలో అగ్రగామిగా కొనసాగుతున్నదని మరోసారి రుజువు చేసింది.

# రాష్ట్రానికి సమృద్ధిగా యూరియా

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో ప్రస్తుతం 80,503 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అన్ని జిల్లాల్లోనూ ఎరువులు సమృద్ధిగా సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. పంపిణీలో ఎక్కడా సమస్య రాకుండా చూడాలని అధికారులకు సీఎం సూచనలు జారీ చేశారు. సోమవారం ఆర్టీజీఎస్ నుంచి రాష్ట్రంలో ఎరువుల సరఫరా, ఉల్లి కొనుగోళ్లు, తురకపాలెం గ్రామంలో ఆరోగ్య పరిస్థితులు, కాఫీ పంటలకు సోకిన తెగులు తదితర అంశాలపై సుదీర్ఘంగా మూడు గంటలపాటు అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో రైతులకు ఎక్కడా యూరియా సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. మరో పది రోజుల్లో 23,592 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి వస్తుందని అన్నారు. ఆర్టీజీఎస్ నుంచి అధికారులతో సమీక్ష నిర్వహిస్తూనే రాష్ట్రానికి మరింత ఎరువుల కేటాయింపుపై కేంద్రమంత్రి జేపీ నడ్డాతో ముఖ్యమంత్రి ఫోన్‌లో మాట్లాడారు. ఇవాళ కాకినాడ తీరానికి చేరుకున్న నౌకలోని 7 రేక్‌ల యూరియాను ఏపీకి కేటాయించాలని కోరారు. దీనిపై స్పందించిన కేంద్రమంత్రి తక్షణమే రాష్ట్రానికి ఆ యూరియాను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రాష్ట్రానికి అదనంగా మరో 50 వేల మెట్రిక్ టన్నుల కేటాయించినట్లైంది. వచ్చే రబీ సీజన్‌కు ఇప్పటి నుంచే యూరియా సరఫరా ప్రణాళికలు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి రైతులకు ఎరువుల పంపిణీకి సంబంధించి భరోసా ఇవ్వాలని సూచించారు. అలాగే రైతులు, కౌలు రైతులు ఎరువులు దొరకవనే ఆందోళనతో ఒకేసారి కొనుగోలు చేయకుండా.. నిల్వచేసి పెట్టుకోకుండా చూడాలని సీఎం పేర్కొన్నారు. అలాగే అనవసరపు కొనుగోళ్లపైనా దృష్టి పెట్టాలని సీఎం పేర్కొన్నారు. నిత్యావసర సరకుల జాబితాలో ఉన్న ఎరువులను బ్లాక్ మార్కెటింగ్ చేయకుండా నియంత్రించాలని సీఎం స్పష్టం చేశారు. కొందరు కావాలనే రాజకీయ దురుద్దేశాలతో చేస్తున్న ప్రయత్నాలను నిలువరించాలని సూచించారు. శాంతిభద్రతల సమస్య సృష్టించేందుకు జరుగుతున్న ఈ తరహా ప్రయత్నాలకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. అధిక మోతాదులో ఎరువుల వినియోగంపై రైతులను చైతన్య పరిచేలా కార్యక్రమాలను, ప్రచారాన్ని నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎరువుల వినియోగాన్ని తగ్గించిన రైతులకు ప్రోత్సాహకంగా సబ్సిడీని రైతుల ఖాతాల్లోకి జమ చేసే పథకంపైనా దృష్టి పెట్టి విస్తృత ప్రచారం చేయాలన్నారు.

**ఉల్లి కొనుగోళ్లు- నిల్వలపై దృష్టి పెట్టండి :** కర్నూలు మార్కెట్‌లో ఉల్లి కొనుగోళు మద్దతు ధరపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. ఉల్లి క్వింటాలుకు రూ. 1200 ధర తగ్గకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. ఎవరైనా ఆ ధరకంటే తక్కువకు అమ్ముకుంటే ఆ మేరకు ప్రభుత్వం చెల్లిస్తుందని పేర్కొన్నారు. ఉల్లి పంట ఉత్పత్తి అంచనాల మేరకు నిల్వ చేసేందుకు గోదాములు, కోల్డ్ స్టోరేజీ సౌకర్యాలను కల్పించాలని సూచించారు. కొనుగోలు చేసిన ఉల్లిని రైతు బజార్లతో పాటు మార్కెట్ కు కూడా తరలించాలని స్పష్టం చేశారు. కర్నూలు జిల్లా కోడుమూరులో పురుగు మందు డబ్బాతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఈ ఘటనలో డ్రామా ఆడిన వారిపై విచారణ చేస్తున్నామని అధికారులు తెలిపారు. పంటను కనీస మార్కెట్ తేకుండానే పురుగుమందు తాగినట్టుగా డ్రామా చేసిన వ్యవహారంపై చర్యలు తీసుకుంటున్నామని అధికారులు స్పష్టం చేశారు. మరోవైపు అరకులో కాఫీ పంటకు సోకిన కాయతొలుచు పురుగు తెగులుపైనా తక్షణ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇప్పటికే తెగులు సోకిన 60 ఎకరాల్లో పంట తొలగించామని మరో 20 ఎకరాల్లో తొలగింపు ప్రక్రియ జరుగుతోందని అధికారులు సీఎంకు వివరించారు. అలాగే తురకపాలెం గ్రామంలో తలెత్తిన ఆరోగ్య పరిస్థితిపైనా ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ వ్యాధికి మూలం ఎక్కడుందన్న అంశాన్ని గుర్తించాలని ఆదేశించారు. దీన్ని కేస్ స్టడీగా తీసుకుని రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు.

**పౌర సేవల్లో సంతృప్త స్థాయికే ప్రాధాన్యత :** ప్రభుత్వ విభాగాలు అందించే వివిధ పౌరసేవల్లో సంతృప్త స్థాయిపై ఇక ప్రతీవారం సమీక్షిస్తానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పెన్షన్లు, ఉచిత గ్యాస్, ఆర్టీసీ, రెవెన్యూ, పంచాయతీరాజ్ ఇలా వేర్వేరు శాఖల్లో అందిస్తున్న సేవలపై ఇంకా సంతృప్త స్థాయి పెరగాలని సీఎం పేర్కొన్నారు. ప్రజల నుంచి వ్యక్తం అయ్యే అభిప్రాయాలను డేటా అనలటిక్స్ ద్వారా విశ్లేషించి తగిన నిర్ణయం తీసుకుంటామని సీఎం తెలిపారు. కొన్ని చోట్ల రాజకీయ కారణాల వల్ల కూడా ప్రజల సంతృప్త స్థాయిపై ప్రభావం చూపుతోందని సీఎం అన్నారు. ప్రతీ ప్రభుత్వ శాఖ ప్రజలకు అందించే పౌరసేవల్ని మరింతగా మెరుగుపర్చుకోవాలని సూచించారు. అలాగే కీ పెర్ఫార్మెన్సు ఇండికేటర్లు ఏమేరకు రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరిగేందుకు ఉపకరిస్తున్నాయన్న అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటామని సీఎం పేర్కొన్నారు. ఆర్టీజీఎస్ నుంచి నిర్వహించిన సమీక్షకు సీఎస్ కే. విజయానంద్




సహా వ్యవసాయ శాఖ, వైద్యారోగ్యశాఖ, మార్కెటింగ్, ఐటీ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**యూరియా సరఫరాపై అధికారులతో టెలికాన్ఫరెన్సు :** వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి యూరియా సరఫరా, లభ్యతపై రైతులకు నమ్మకాన్ని కల్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో మరోమారు టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. రాష్ట్రంలో యూరియా లభ్యత సమృద్ధిగానే ఉందని దానిని సక్రమంగా వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మోతాదుకు మించి ఎరువులు వినియోగిస్తే భూసారం కూడా దెబ్బతింటుందన్న అంశాన్ని రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. కొందరు రైతులు రబీ కోసం కూడా ఇప్పుడే కొనుగోలు చేయకుండా చూడాలని అన్నారు. రబీ పంట కోసం ముందస్తుగానే ఎరువులను సిద్ధం చేస్తున్నట్టు సీఎం పేర్కొన్నారు. కొందరు రాజకీయ ముసుగులో క్రిమినల్స్ తరహాలో ఆలోచిస్తూ ఎరువులు లభ్యత ఉండదన్న అభద్రతా భావాన్ని కల్పిస్తున్నారని దీన్ని నియంత్రించాలన్నారు. ఎక్కడా రైతుల్లో ఆందోళన లేకుండా భరోసా కల్పించాలని స్పష్టం చేశారు. సీజన్ లో సాగునీరు ముందుగానే ఇవ్వటం వల్ల పంటల సాగుకూడా ఎక్కువ చేశారని.. వాణిజ్య పంటలైన ఉల్లి, మామిడి, మ్యాంగో, టమాటో, చీని కాయల ఉత్పత్తి ఎక్కువ వచ్చే అవకాశం ఉందని .. దీనికి స్వల్ప, మధ్య, ధీర్ఘ కాలిక ప్రణాళికలు ఉండాలని సూచించారు. మరోవైపు ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా సహా విష జ్వరాలు సోకకుండా చర్యలు చేపట్టాలని సీఎం జిల్లా కలెక్టర్ కు సూచనలు జారీ చేశారు. ఆర్టీజీఎస్ సమీక్షతో పాటు టెలికాన్ఫరెన్సు ద్వారా దాదాపు 5 గంటల పాటు సీఎం యూరియా సహా వివిధ అంశాలపై సమీక్షించారు. టెలికాన్ఫరెన్సు ద్వారా నిర్వహించిన సమీక్షకు మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, జిల్లా వ్యవసాయ అధికారులు హాజరయ్యారు.

# ప్రత్యామ్నాయ వ్యూహాలతో భారత్ రెడీ



## ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా పలు ప్రణాళికలు

### లక్షలాది ఉద్యోగులను కాపాడేందుకు వ్యూహం

### కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 8:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఔట్‌సోర్సింగ్‌పై కఠిన వైఖరి అవలంబించవచ్చనే భయాలు పెరుగుతున్న నేపథ్యంలో భారత్ ప్రభుత్వం అప్రమత్తమైంది. సుమారు 300 బిలియన్ డాలర్ల విలువైన దేశీయ టెక్నాలజీ పరిశ్రమను, దానిపై ఆధార పడిన లక్షలాది ఉద్యోగాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం పక్కా వ్యూహంతో ముందుకు వెళుతున్నట్లు కేంద్ర రైల్వే, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. ఐటీ ఉద్యోగుల భవిష్యత్తుకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా చూసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన భరోసా ఇచ్చారు. అమెరికాలోని ట్రంప్ మద్దతుదారులు 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (మాగా)' నినాదంతో అవుట్‌సోర్సింగ్‌కు వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు. దీనిపై కేంద్రమ ంత్రి అశ్విని వైష్ణవ్ స్పందించారు. భారత్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు అంటే జీసీసీలు, భారీ సేవా కార్యకలాపాలు నిర్వహిస్తున్న బహుళజాతి సంస్థలతో మేం నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. అదే సమయంలో అమెరికా, యూరప్, జపాన్, ఆగ్నేయాసియా దేశాల ప్రభుత్వాలతోనూ చర్చిస్తున్నాం. అత్యున్నత నాణ్యతతో కూడిన ఉపాధిని అందిస్తున్న ఈ కీలక పరిశ్రమ చెక్కుచెదరకుండా, మరింత వృద్ధి చెందేలా చూడటమే మా లక్ష్యమని ఆయన వివరించారు. ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో చేసిన వ్యాఖ్యలు ఈ ఆందోళనలకు మరింత ఆజ్యం పోశాయి.

విదేశీ రిమోట్ వర్కర్లపై టారిఫ్‌లు (పన్నులు) విధించాలని, అమెరికాకు రిమోట్‌గా సేవలు అందించే దేశాలు కూడా వస్తువుల మాదిరిగానే పన్నులు చెల్లించాలని ఆయన సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఇది నేరుగా భారతదేశ విదేశీ మారకద్రవ్య ఆర్జనపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. భారత ఐటీ సేవల రంగంలో ప్రస్తుతం 56 లక్షల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. దేశ ఎగుమతి ఆదాయంలో ఈ రంగం వాటా చాలా కీలకం. అయితే, కేవలం సేవల ఎగుమతులపైనే ఆధారపడకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను కూడా బలోపేతం చేస్తోందని మంత్రి వైష్ణవ్ తెలిపారు. దేశీయంగా ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాన్ని శక్తిమంతం చేస్తున్నాం. స్మార్ట్‌ఫోన్ల తయారీలో మన వాటా గణనీయంగా పెరిగింది. ఎలక్ట్రానిక్స్‌కు సంబంధించిన అన్ని పరికరాలను ఒక్కొక్కటిగా దేశంలోనే తయారు చేసేలా సరఫరా గొలుసును స్థానికీకరిస్తున్నామని ఆయన అన్నారు. ప్రస్తుతం ఉన్న ఐటీ ఉద్యోగాలను కాపాడుకుంటూనే, దేశంలోని నైపుణ్యం కలిగిన యువతకు తయారీ రంగంలో కొత్త అవకాశాలు సృష్టించడమే తమ ద్వంద్వ వ్యూహమని ఆయన స్పష్టం చేశారు. ప్రముఖ ఐటీ పరిశ్రమల సంస్థ నాస్కామ్ అంచనాల ప్రకారం, ఈ ఆర్థిక సంవత్సరంలో భారత టెక్నాలజీ రంగం 5.1 శాతం వృద్ధితో 282.6 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించనుంది. 2026 ఆర్థిక సంవత్సరం నాటికి ఇది 300 బిలియన్ డాలర్ల మైలురాయిని దాటుతుందని అంచనా. ఈ రంగంలో కొత్తగా 1.26 లక్షల ఉద్యోగాలు కూడా రానున్నాయని నాస్కామ్ తన నివేదికలో పేర్కొంది.

# వెనెజులాపై యుద్ధానికి ట్రంప్ రెడీ..



## భారీగా యుద్ధనౌకలు, ఫైటర్ జెట్ల మోహరింపు

**వాషింగ్టన్, సెప్టెంబరు 8:** తాను ఏడు యుద్ధాలను ఆపానని పదేపదే చెప్పుకొంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ఓ కొత్త యుద్ధానికి తెరతీశారు. ఆ మేరకు కరేబియన్ సముద్రంలో భారీ యుద్ధనౌకలు, జలాంతరాములు, అత్యాయుధునిక ఫైటర్ జెట్‌లను మోహరించారు. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలున్న వెనెజులా చుట్టూ ఇవి సమయం కోసం ఎదురుచూస్తూ కాచుకు కూర్చున్నాయి. దాంతో కరేబియన్ జలాలపై యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఏ క్షణమైనా అమెరికా దళాలు వెనెజులాలో చొరబడవచ్చని ప్రచారం జరుగుతోంది. వెనెజులా ముఠాల నుంచి మాదకద్రవ్యాలు అమెరికాను ముంచెత్తుతున్నాయని ట్రంప్ చాలాకాలంగా చెబుతూ వస్తున్నారు. ఇప్పుడు ఆ ముఠాలను అంతం చేసేందుకు సైనికదళాలను రంగంలోకి దింపారు. మాదకద్రవ్యాల ముఠాలతో వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురోకు సంబంధాలున్నాయని ట్రంప్ కార్యవర్గం తీవ్ర ఆరోపణలు చేస్తోంది. అతడిని పట్టించే సమాచారం ఇస్తే ఏకంగా 50 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 430కోట్లు) బహుమతిగా ఇస్తామని ప్రకటించింది. అంతేగాక మదురో సర్కారు ఇక రోజులు లెక్కపెట్టుకోవాలని ట్రంప్ స్వయంగా సోషల్ మీడియాలో హెచ్చరించారు.

# 60 శాతం ఆయుధాలు మావే

## ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ



**కీవ్, సెప్టెంబరు 8:** మూడేళ్లుగా రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఉపయోగిస్తున్న ఆయుధాల్లో 60శాతం తమ దేశంలో ఉత్పత్తి చేసినవేనని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. ఇతర దేశాల నుంచి ఆయుధాలను దిగుమతి చేసుకుంటున్నప్పటికీ స్వదేశీ ఉత్పత్తులపైనే ఎక్కువగా దృష్టి పెట్టామన్నారు. ఓ వైపు సంఘర్షణలు కొనసాగుతున్నప్పటికీ కీవ్ బలమైన, అత్యాధునిక ఆయుధాలను తయారుచేసే స్థాయికి ఎదగడం గర్వకారణమని చెప్పారు. అయితే తాము సాధించాల్సిన లక్ష్యాలు ఇంకా ఉన్నాయని జెలెన్‌స్కీ అన్నారు. ప్రస్తుతం గగనతల రక్షణ వ్యవస్థల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఇటీవల గగనతల రక్షణ వ్యవస్థలతోపాటు రెండు కొత్త బాలిస్టిక్ క్షిపణులను అభివృద్ధి చేసినట్లు కీవ్ వర్గాలు తెలిపాయి. విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు 2025 బడ్జెట్‌లో ఉక్రెయిన్ సర్కారు భారీ కేటాయింపులు చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే చైనా పర్యటన తర్వాత రష్యా అధ్యక్షుడు పుతిన్ మాట్లాడుతూ యుద్ధం ముగింపుపై చర్చలు జరపడానికి మాస్కోకు రావాలని జెలెన్‌స్కీను ఆహ్వానించారు. దీనిపై జెలెన్‌స్కీ స్పందిస్తూ యుద్ధం ముగింపు కోసం ఓ నిర్ణయం తీసుకోవాలనే ఆలోచన పుతిన్‌కు ఉంటే ఆయనే కీవ్‌కు రావాలన్నారు.

# ఆస్తి తగాదాలో మహిళను చెట్టుకు కట్టేసి దాడి



**కడలూరు, సెప్టెంబరు 8:** తమిళనాడులో సభ్యసమాజం తలదించుకునే దారుణ ఘటన చోటుచేసుకుంది. భూవివాదం కారణంగా ఓ మహిళను నలుగురు మహిళలు కలిసి చెట్టుకు కట్టేసి, విచక్షణా రహితంగా దాడి చేశారు. ఆమెను పాక్షికంగా వివస్త్రను చేసి తీవ్రంగా అవమానించారు. కడలూరు జిల్లా పన్రుటి సమీపంలో జరిగిన ఈ అమానుష ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాధితురాలికి, నిందితులకు మధ్య కొంతకాలంగా భూవివాదం నడుస్తోంది. ఇదే కక్షతో నలుగురు మహిళలు ఆమెపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, నిందితులలో ఒక మహిళను అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నట్టు ఓ సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. ప్రాథమిక విచారణలో భూవివాదమే ఈ దాడికి కారణంగా తెలుస్తోంది. కులం కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన 2.13 నిమిషాల నిడివి గల వీడియోలో అత్యంత దారుణమైన దృశ్యాలు ఉన్నాయి. బాధితురాలిని ఆమె చీరతోనే చెట్టుకు కట్టేసి, నలుగురు మహిళలు చుట్టుముట్టారు. ఒకరు కర్రతో కొడుతుండగా, మరొకరు ఆమె జుట్టు పట్టుకుని లాగుతూ దూషించారు. నువ్వు ఓ కుక్కతో సమానం అంటూ దారుణంగా మాట్లాడారు. ఆమె బ్లౌజ్‌ను పాక్షికంగా తొలగించి అవమానించే ప్రయత్నం చేశారు. బాధితురాలు వారి నుంచి తప్పించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించడం వీడియోలో కనిపించింది. ఆశ్చర్యకరంగా, అక్కడే ఉన్న మరో మహిళ ఈ దాడినంతా వీడియో తీస్తుండగా, మీరంతా జైలుకు వెళ్తారని హెచ్చరించినా నిందితులు ఏమాత్రం లెక్కచేయలేదు. దాడి తీవ్రరూపం దాల్చడంతో మధ్యలో మరో మహిళ కల్పించుకుని వారిని ఆపేందుకు ప్రయత్నించడం కూడా వీడియోలో రికార్డయింది. ఈ ఘటనపై స్థానికంగా తీవ్ర కలకలం రేగగా, పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

# పిఎంవో ఎంత బలహీనంగా ఉందో మన్మోహన్ ట్వీట్ నిదర్శనం

## బిజెపి ఐటీ-చీఫ్ అమిత్ మాలవీయ ధ్వజం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 8:** పన్నెండేళ్ల నాటి ఒక సోషల్ మీడియా పోస్టును ఆధారంగా చేసుకుని బిజెపి కాంగ్రెస్ పార్టీపై ఆదివారం తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది. నాటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ అధికారిక ఖాతా నుంచి వచ్చిన ఆ పోస్ట్, అప్పటి యూపీఏ ప్రభుత్వంలో ప్రధాని కార్యాలయం (పీఎంవో) ఎంత బలహీనంగా ఉండేదో చెప్పడానికి నిదర్శనమని బీజేపీ ఆరోపించింది. బిజెపి ఐటీ విభాగం అధిపతి అమిత్ మాలవీయ ఈ విషయంపై 'ఎక్స్' వేదికగా స్పందించారు. 2013 సెప్టెంబర్ 7న ప్రధాని కార్యాలయం చేసిన పోస్టును ఆయన ట్యాగ్ చేశారు. అప్పటికి, ఇప్పటికీ ఇదే తేడా అంటూ తన విమర్శలకు పదును పెట్టారు. అప్పట్లో దేశ పరిస్థితి ఎలా ఉండేదంటే, స్వయంగా ప్రధాన మంత్రి కార్యాలయం కూడా కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ వైఫల్యాలను, గందరగోళాన్ని బయటపెట్టేలా పోస్టులు చేయాల్సి వచ్చిందని ఆయన అన్నారు. 2013లో మన్మోహన్ సింగ్ కార్యాలయం నుంచి వెలువడిన ఆ పోస్టులో, మిస్టర్ రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేయడానికి నేను సంతోషిస్తాను పీఎం అని ఉంది. ఈ పోస్టును ఉటంకిస్తూ మాలవీయ, ఒక దేశ ప్రధాని కార్యాలయం అధికారిక ఖాతా నుంచి ఇలాంటి సందేశాలు పోస్ట్ చేయాల్సి వచ్చిందంటే, క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఎంత దారుణంగా ఉండేవో అర్థం చేసుకోవచ్చని వ్యాఖ్యానించారు. యూపీఏ హయాంలో ప్రభుత్వ పాలనలో పార్టీ జోక్యం ఏ స్థాయిలో ఉండేదో, పీఎంవో వనరులను పార్టీ వ్యవహారాలకు ఎలా దుర్వినియోగం చేశారో దీని ద్వారా తెలుస్తోందని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో పీఎంవో నిర్ణయాధికారంలో ఎంతో స్పష్టత, పటిష్టత ఉన్నాయని, యూపీఏ హయాంలో అందుకు భిన్నమైన పరిస్థితులు ఉండేవని మాలవీయ పోల్చి చెప్పారు. కాగా, ప్రధాని నరేంద్ర మోదీ సైతం పాల్గొన్న బిజెపి ఎంపీల వర్క్‌షాప్ పార్లమెంట్ ప్రాంగణంలో జరుగుతున్న తరుణంలో అమిత్ మాలవీయ ఈ విమర్శలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# జపాన్ ప్రధానమంత్రి షిగెరు ఇషిబా రాజీనామా



**టోక్యో, సెప్టెంబరు 8:** జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీలో అంతర్గత విభేదాలకు స్వస్తి పలకాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జూలైలో జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో పార్టీ పరాజయానికి బాధ్యత వహించాలంటూ సొంతపార్టీ నేతల నుంచి ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో ఇషిబా నుంచి ఈ ప్రకటన వెలువడింది. అంతకుముందు దిగువ సభలోనూ మెజార్టీ కోల్పోయింది. దీంతో స్వపక్ష సభ్యుల నుంచి ప్రధానిపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో పార్టీ నాయకత్వ మార్పు కోసం ముందస్తు ఎన్నికలు నిర్వహించాలా? వద్దా? అనే అంశంపై చర్చించేం దుకు లిబరల్ డెమోక్రటిక్ పార్టీ సెప్టెంబరు 8న నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమైంది. దీనికి ఆమోదం పొందితే ప్రధానిపై వర్చువల్ అవిశ్వాసతీర్మానం పెట్టే అవకాశం ఉంది. ఈనేపథ్యంలోనే మీడియా సమావేశం నిర్వహించిన ఇషిబా రాజీనామా ప్రకటించారు.

# ఇంకెన్నాళ్లు బీహార్ ప్రజలను మోసం చేస్తారు రాహుల్!

## విపక్షనేత పై కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్ ధ్వజం

**పాట్నా, సెప్టెంబరు 8:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జాతీయ చిహ్నమైన అశోక చక్రం ఉన్న ఫలకాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేసిన ఘటనపై స్పందిస్తూ దేశంలో అస్థిరతకు, అగౌరవానికి రాహుల్ గాంధీ కారణమవుతున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ చెప్పినట్టు దేశం నడిస్తే అది కుప్పకూలిపోతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. బీహార్ నుంచి కశ్మీర్ వరకు దేశాన్ని అగౌరవపరిచేలా రాహుల్ వ్యవహరిస్తున్నారని గిరిరాజ్ సింగ్ మండిపడ్డారు. పాత రాజకీయ వివాదాలను కూడా ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. తేజస్వి యాదవ్, లాలూ యాదవ్‌లను అడుగుతున్నా, బీహార్‌ను ఇంకెన్నిసార్లు అవమానిస్తారు స్టాలిన్‌ను పిలిపించి తిట్టించారు. బీహార్ డీఎన్‌ఏను అవమానించిన రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. ఇప్పుడు కశ్మీర్‌లో ఏం జరిపించారు అని రాహుల్‌ను ఉద్దేశించి నిలదీశారు. శ్రీనగర్‌లోని హజరత్‌బల్ దర్గాలో జమ్మూకశ్మీర్ వక్ఫ్ బోర్డు చేపట్టిన పునరుద్ధరణ పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ ఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో ఈ వివాదం చెలరేగింది. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తడంతో జమ్మూకశ్మీర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా గిరిరాజ్ సింగ్ మాట్లాడుతూ అశోక స్తంభం కేవలం బీహార్‌కు చెందిన అశోక చక్రవర్తి స్తంభం మాత్రమే కాదు. దానిని మన రాజ్యాంగం స్వీకరించింది, యావత్ దేశం దాన్ని గౌరవిస్తోందని నొక్కిచెప్పారు. రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లి దేశాన్ని అవమానిస్తుంటే, ప్రధాని మోదీ మాత్రం పేదలు, మధ్యతరగతి ప్రజల గురించి ఆలోచిస్తున్నారని అన్నారు. 27 కోట్ల మంది పేదలను దారిద్ర్యరేఖ నుంచి పైకి తీసుకువచ్చారని, జీఎస్టీని సులభతరం చేసి పండుగ వేళ పేద కుటుంబాలకు మేలు చేశారని గిరిరాజ్ సింగ్ పేర్కొన్నారు.

# డ్రగ్స్‌కేసులో కటకటాలపాలయిన బ్రిటన్ లా విద్యార్థిని



**దుబాయి, సెప్టెంబరు 8:** ఉన్నత చదువులు చదివి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన ఓ యువతి జీవితం ఒక్క పొరపాటుతో తలకిందులైంది. చట్టాలపై పట్టు సాధించాల్సిన లా విద్యార్థినే చట్టాలను ఉల్లంఘించి కటకటాలపాలైంది. డ్రగ్స్ కేసులో పట్టుబడిన 23 ఏళ్ల బ్రిటిష్ విద్యార్థిని మియా ఒబ్రెయిన్‌కు దుబాయ్ కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ప్రస్తుతం ఆమె దుబాయ్ సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తోంది. లివర్‌పూల్‌కు చెందిన మియా ఒబ్రెయిన్ న్యాయశాస్త్రంలో విద్యనభ్యసిస్తోంది. గతేడాది అక్టోబర్‌లో ఆమె దుబాయ్‌లో అరెస్ట్ అయింది. అప్పటి నుంచి తన కుమార్తెను చూడలేదని ఆమె తల్లి డేనియల్ మెకెన్నా (46) కన్నీటిపర్యంతమవుతున్నారు. నా కుమార్తె తన జీవితంలో ఎప్పుడూ ఎలాంటి తప్పు చేయలేదు. దురదృష్టవశాత్తు కొందరు తప్పుడు స్నేహితులతో కలిసి ఓ తెలివి తక్కువ పని చేసింది. ఇప్పుడు దానికి భారీ మూల్యం చెల్లించుకుంటోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ఆమె కుటుంబం నేరం వివరాలను వెల్లడించనప్పటికీ మియా వద్ద 50 గ్రాముల క్లాస్ ఏ డ్రగ్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు 2,500 పౌండ్లు (భారత కరెన్సీలో దాదాపు రూ. 3 లక్షలు)ఉంటుందని అంచనా. మియాకు సహాయం చేసేందుకు ఆమె తల్లి 'గోఫండ్‌మీ' ద్వారా నిధులసేకరణ ప్రారంభించినా, ఆ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో దాన్ని తొలగించారు. కొన్నిరకాల తీవ్రమైన నేరాలకు న్యాయ సహాయం కోసం నిధులు సేకరించడాన్ని తమ నిబంధనలు అంగీకరించవని గోఫండ్‌మీ ప్రతినిధి స్పష్టం చేశారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో అమలయ్యే కఠినమైన చట్టాల ప్రకారం జీవిత ఖైదు అంటే 15 నుంచి 25 ఏళ్ల వరకు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. డ్రగ్స్ అక్రమ రవాణా, హత్య,మానవ అక్రమరవాణా, ఉగ్రవాద కార్యకలాపాలు వంటి తీవ్రమైన నేరాలకు అక్కడ ఇలాంటి కఠిన శిక్షలు విధిస్తారు.

# భారత్‌పై నవారో వ్యాఖ్యలకు 'ఎక్స్' ఫ్యాక్ట్ చెక్..

**వాషింగ్టన్, సెప్టెంబరు 8:** భారత్‌పై తరచూ తీవ్ర విమర్శలు చేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సీనియర్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారోకు ఎలాన్‌మస్క్ సోషల్‌మీడియా ఎక్స్ గట్టి షాకిచ్చింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ భారత్ లాభాలు గడిస్తోందని నవారో చేసిన ఆరోపణలు ద్వంద్వ నీతికి నిదర్శనమని పేర్కొంటూ, ఆయన పోస్టుకు ఒక ఫ్యాక్ట్ చెక్ నోట్‌ను జోడించింది. రష్యా నుంచి భారత్ చమురు దిగుమతి చేసుకోవడాన్ని తప్పుబడుతూ నవారో ఎక్స్‌లో ఒక పోస్ట్ చేశారు. భారత్ విధిస్తున్న అధిక సుంకాల వల్ల అమెరికా ఉద్యోగాలు కోల్పోతోంది. కేవలం లాభం కోసమే భారత్ రష్యా నుంచి చమురు కొంటోంది. ఆ డబ్బుతో రష్యా యుద్ధాన్ని ప్రోత్సహిస్తోంది. భారత్ నిజాలను జీర్ణించుకోలేకపోతోందని ఆయన ఆరోపించారు. అయితే, ఈ పోస్టుకు ఎక్స్ సంస్థ కమ్యూనిటీ నోట్ రూపంలో ఒక ఫ్యాక్ట్ చెక్‌ను జతచేసింది. భారత్ తన ఇంధన భద్రత కోసమే రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోంది. ఇది అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడం కాదు. మరోవైపు, అమెరికా కూడా రష్యా నుంచి యురేనియంవంటి వస్తువులను దిగుమతి చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో భారత్‌ను విమర్శించడం ద్వంద్వ నీతి అవుతుందని ఆ నోట్‌లో స్పష్టం చేసింది. ఈ అనూహ్య పరిణామంతో నవారో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఒక పనికిమాలిన నోట్‌అని, ప్రజల పోస్టుల్లో ఇలాంటి ప్రచారానికి ఎలాన్ మస్క్ ఎలా అనుమతిస్తున్నారని మండిపడ్డారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తుండటంతో ప్రతీకారంగా ట్రంప్ సర్కార్ ఇటీవల భారత ఎగుమతులపై 50 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి నవారో భారత్‌ను లక్ష్యంగా చేసుకుని ఇది మోదీ యుద్ధమని, భారత్ టారిఫ్‌ల మహారాజ్ అని వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. ఈ సుంకాల వివాదం కారణంగా భారత్-అమెరికా సంబంధాల్లో కొంత ఉద్రిక్తత నెలకొంది. అయితే, ప్రధాని మోదీతో తనకు మంచి స్నేహంఉందని, ఇరుదేశాల మధ్య ప్రత్యేక బంధంఉందని ట్రంప్ ఇటీవల పేర్కొన్నారు. దీనికి ప్రధాని మోదీ కూడా స్పందించడంతో సంబంధాలు తిరిగి గాడినపడతాయని అందరూ భావిస్తున్న తరుణంలో నవారో వ్యాఖ్యలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి.

# పదేళ్లుగా ఓట్ల చోరులను కాపాడుతున్న ఇసి: మల్లిఖార్జున్ ఖర్గే



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 8:** పదేళ్లుగా భారత ఎన్నికల సంఘం (ఈసిఐ) ఓట్ల చోరులను పరిరక్షిస్తోందని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. పదేళ్లుగా ఈసీ ఓట్ల చోరులను కాపాడుతూ వస్తోందని, కీలక సమాచారాన్ని దాచి పెట్టిందని ఆరోపించారు. 2023లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటరు జాబితా నుంచి ఓట్లను తొలగించడానికి చేసిన యత్నానికి సంబంధించిన కీలక డేటాను ఇప్పటికీ ఎన్నికల సంఘం బయటపెట్టలేదన్నారు. మే 2023 కర్ణాటక ఎన్నికలకు ముందు అలంద్ నియోజకవర్గంలో ఓటర్లను తొలగించాలని చేసిన ప్రయత్నాలను తమ పార్టీ బయటపెట్టిందని ఖర్గే చెప్పారు. అప్పట్లో దీనివల్ల వేలమంది ఓటర్లు తమ ఓటు హక్కులు కోల్పోయారన్నారు. ఓటర్లను మోసం చేయడానికి జరిగిన భారీ ప్రయత్నానికి స్పష్టమైన సాక్ష్యాలు ఉన్నప్పటికీ కీలక విషయాలను దాచిపెట్టి, ఓట్ల చోరీ వెనక ఉన్న వారిని ఈసీ సమర్థంగా రక్షించిందన్నారు. ఓట్ల చోరీకి పాల్పడుతున్న వారిని కాపాడటమే లక్ష్యంగా ఈసీ పదేళ్లుగా పని చేస్తోందని ఖర్గే చెప్పారు. అందుకు చట్టాలను మార్చడానికి కూడా వెనకాడట్లేదని విమర్శించారు. నాడు కర్ణాటకలో చేసిన విధంగా ప్రస్తుతం బీహార్‌లోనూ ఓట్ల చోరీకి పాల్పడేందుకు కేంద్రం, ఈసీ కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు.

# సంక్షిప్తంగా..

## అమెరికా లోకల్ రైలులో మహిళ దారుణ హత్య



**వాషింగ్టన్, సెప్టెంబరు 8:** రష్యాతో యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్‌లో భయాందోళనల మధ్య బతకలేక అమెరికాకు వలస వచ్చిందో మహిళ ప్రాణాలు కాపాడుకోవడానికి వలస వచ్చిన సదరు మహిళ అమెరికాలో దారుణ హత్యకు గురైంది. లోకల్ రైలులో ప్రయాణిస్తుండగా ఓ దుండగుడు కత్తితో దాడి చేయడంతో ప్రాణాలు కోల్పోయింది. ఈ హత్యకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. గత నెలాఖరులో జరిగిన ఈ దారుణం తాజాగా వెలుగులోకి వచ్చింది. రష్యా దాడుల నేపథ్యంలో నిత్యం భయంభయంగా గడపలేక ఉక్రెయిన్ మహిళ ఇరినా జరుత్స్కను అమెరికాకు వలస వచ్చింది. నార్త్ కరోలినాలో ప్రశాంతమైన జీవితం గడుపుతోంది. ఈ క్రమంలోనే గత నెల 22న షార్లెట్ లో లోకల్ రైలులో ప్రయాణిస్తుండగా ఓ దుండగుడు ఆమెపై దాడి చేశాడు. రైలులో ఇరినా వెనక సీటులో కూర్చున్న దుండగుడు. జేబులో నుంచి కత్తి తీసి ఒక్కసారిగా ఇరినాపై దాడికి పాల్పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలు, రక్తస్రావంతో ఇరినా అక్కడికక్కడే చనిపోయింది.

## ఛాతీలో కత్తితో పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన స్కూలు విద్యార్థి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 8:** దేశ రాజధాని ఢిల్లీలో దిగ్భ్రాంతికరమైన ఘటన చోటుచేసుకుంది. 15 ఏళ్ల పాఠశాల విద్యార్థి తన ఛాతీలో కత్తి దిగి ఉండగానే నడుచుకుంటూ పోలీస్ స్టేషన్‌కు చేరుకోవడం తీవ్ర కలకలం రేపింది. పాత పగ నేపథ్యంలో అతడి స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులే ఈ దాడికి పాల్పడినట్టు పోలీసులు వెల్లడించారు. సెంట్రల్ ఢిల్లీలోని ఓ పాఠశాలలో చదువుతున్న 15 ఏళ్ల బాలుడు పహార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. అతడి ఛాతీలో కత్తి దిగి ఉండటం చూసి పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. పాఠశాల గేటు వద్ద తన ముగ్గురు స్నేహితులు తనపై దాడి చేసి కత్తితో పొడిచారని బాధితుడు పోలీసులకు తెలిపాడు. దీంతో పోలీసులు అతడిని వెంటనే తొలుత కళావతి శరణ్ ఆసుపత్రికి, ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు శస్త్రచికిత్స చేసి కత్తిని తొలగించారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు దాడి జరిగిన మరుసటి రోజు సాయంత్రం ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

## గోశాలగా మారిన పోలీస్ స్టేషన్



**రాంచి, సెప్టెంబరు 8:** జార్ఖండ్‌లోని ఓ పోలీస్ స్టేషన్ రెండు రోజుల పాటు గోశాలగా మారిపోయింది. అక్రమ రవాణా ఆరోపణలతో పట్టుకున్న సుమారు 200 పశువులను ఉంచేందుకు మరో ప్రత్యామ్నాయం లేకపోవడంతో పోలీసులు వాటిని స్టేషన్ ఆవరణలోనే కట్టేశారు. ఈ అనూహ్య ఘటన గర్వా జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పశువులను అక్రమంగా తరలిస్తున్నారంటూ భజరంగ్ దళ్ జిల్లా అధ్యక్షుడు సోను సింగ్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు సుమారు 170 నుంచి 200 పశువులను స్వాధీనం చేసుకున్నారు. అయితే, వాటిని ఉంచడానికి తక్షణమే గోశాల అందుబాటులో లేకపోవడంతో వాటిని పోలీస్ స్టేషన్ ప్రాంగణానికే తరలించారు. శుక్రవారం రాత్రి వరకు ఆ పశువులు అక్కడే ఉన్నాయి. ఈ ఘటనపై భజరంగ్ దళ్ నేత సోను సింగ్ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ నుంచి ఈ పశువులను వధశాలల కోసం అక్రమంగా తరలిస్తున్నారు. స్మగ్లర్లు మాపై, పోలీసులపై దాడి చేసేందుకు కూడా ప్రయత్నించారు. ఈ వ్యవహారం వెనుక పెద్ద వ్యక్తులు ఉన్నారని ఆరోపించారు.

# దక్షిణకొరియా వేదికగా ట్రంప్, జిన్‌పింగ్‌ల భేటీకి రంగం సిద్ధం



**సియోల్, సెప్టెంబరు 8:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య మరో కీలక భేటీకి రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అక్టోబర్‌లో దక్షిణ కొరియా లో జరగనున్న ఆసియాపసిఫిక్ ఆర్థిక సహకార (ఏపీఈసీ) సదస్సులో పాల్గొనేందుకు ట్రంప్, ఆయన ఉన్నతాధికారులు రహస్యంగా సన్నాహాలు చేస్తున్నారని అమెరికా అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ పర్యటనలో భాగంగా జిన్‌పింగ్‌తో ట్రంప్ సమావేశమయ్యే అవకాశాలున్నాయి. దక్షిణ కొరియాలోని గ్యాంగ్‌ఝౌ నగరంలో అక్టోబర్ చివరి వారం నుంచి నవంబర్ మొదటి వారం మధ్య ఈ ఏపీఈసీ సదస్సు జరగనుంది. ఈ సదస్సు వేదికగా ఇరువురు నేతల మధ్య ద్వైపాక్షిక సమావేశంపై తీవ్రస్థాయిలో చర్చలు జరుగుతున్నాయని, అయితే ప్రణాళికలు ఇంకా ఖరారు కాలేదని ట్రంప్ పరిపాలన వర్గాలు తెలిపాయి. గత నెలలో జిన్‌పింగ్ ఫోన్‌లో ట్రంప్‌ను చైనా పర్యటనకు ఆహ్వానించగా, ట్రంప్ కూడా సానుకూలంగా స్పందించారు. అయితే పర్యటన తేదీలు ఖరారు కాలేదు. ఈ పర్యటనలో ట్రంప్ కేవలం జిన్‌పింగ్‌తోనే కాకుండా, ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో కూడా సమావేశమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతవారం ట్రంప్‌తో సమావేశమైన దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్, ఏపీఈసీ సదస్సుకు హాజరు కావాలని ఆహ్వానించారు. కిమ్‌తో సమావేశానికి ఇది మంచి అవకాశమని కూడా ఆయన సూచించినట్లు సమాచారం. దీనిపై స్పందించిన ట్రంప్, కిమ్‌తో భేటీకి తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఆయన నన్ను కలవాలనుకుంటున్నారు. మేం కలుస్తాం, సంబంధాలు మెరుగుపరుస్తాం అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇటీవల చైనా, రష్యా, భారత అధినేతలు బీజింగ్‌లో సమావేశమవడంపై ట్రంప్ తీవ్ర విమర్శలు గుప్పించిన నేపథ్యంలో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. చైనా సైనిక పరేడ్ సందర్భంగా జిన్‌పింగ్, పుతిన్, మోదీ భేటీ కావడంపై ట్రంప్ సోషల్ మీడియాలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# మధ్యప్రదేశ్ పిసిసి చీఫ్ ఇంట్లో చోరీ



**భోపాల్, సెప్టెంబరు 8:** మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు (పీసీసీ చీఫ్) జీతూ పట్వారీ ఇంట్లో జరిగిన చోరీ ఘటన రాష్ట్రంలో తీవ్ర కలకలం సృష్టించింది. ఇండోర్ రాజేంద్ర నగర్‌లోని బిజల్‌పూర్ కాలనీలో ఉన్న ఆయన నివాసంలోకి ఆరుగురి కంటే ఎక్కువ మంది దొంగలు చొరబడి బీభత్సం సృష్టించారు. తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరగడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. చోరులు చాలా వ్యూహాత్మకంగా మొదటగా ఆ ఇంటికి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఆ తర్వాత బయట ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అనంతరం ఇంట్లోఉన్న కార్యాలయంలోకి వెళ్లిఅక్కడి డ్రాలు, లాకర్లను పగలగొట్టారు. అయితే ఈ చోరీ వెనుక ఉన్న ఉద్దేశంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దొంగలు ఇంట్లో ఉన్న మొబైల్ ఫోన్లు, ఇతర విలువైన వస్తువులను వదిలి పెట్టి కొన్ని సాధారణ వసువులను మాత్రమే తీసుకువెళ్లారు. దీంతో కుటుంబ సభ్యులు సహా పోలీసులు అంతా షాక్ అవుతున్నారు.



తెలంగాణ కంటిజెంట్ జట్టు సభ్యులకు క్రీడా కిట్లను అందిస్తున్న రాష్ట్ర జైళ్లు, సవరణ శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా

## రేపటి నుంచి అఖిలభారత జైల్ డ్యూటీమీట్ 2025

### రాష్ట్ర జైళ్లు, సవరణ శాఖ డిజి సౌమ్యమిశ్రా

**హైదరాబాద్, సెప్టెంబరు 8(జర్నలిస్ట్‌ఫైల్):** తెలంగాణ జైళ్లు, సవరణశాఖ ఆధ్వర్యంలో 7వ అఖిల భారత జైలు డ్యూటీ మీట్-2025 ఈ నెల 9 నుండి 11 వరకు హైదరాబాదులోని ఆర్బీవీఆర్ఆర్ (తెలంగాణ పోలీస్ అకాడమీ)లో జరగనున్నట్లు రాష్ట్ర జైళ్లు, సవరణ శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా తెలిపారు. దేశంలోని 21 రాష్ట్రాలతో పాటు 3 కేంద్రపాలిత ప్రాంతాల నుండి వచ్చిన 1300 మందికి పైగా జైలు సిబ్బంది (ఇందులో 184 మంది మహిళలు) పాల్గొని 36 విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శిస్తారన్నారు. వీటిలో ప్రథమ చికిత్స, వెల్ఫేర్ పథకాలు, క్విజ్, కంప్యూటర్ నైపుణ్యం వంటి వృత్తి సంబంధిత పోటీలు, అలాగే అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, బాస్కెట్‌బాల్, కరాటే, క్రావ్ మాగా, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం వంటి క్రీడలు, సాంస్కృతిక పోటీలు ఉంటాయని వివరించారు. ఈ ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్రం రెండవసారి ఆతిథ్యం ఇస్తోంది. 2015లో తొలిసారి నిర్వహించగా, 2022లో అహ్మదాబాద్‌లో జరిగిన 6వ జైలు డ్యూటీ మీట్‌లో తెలంగాణ రాష్ట్రం ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించింది. ఈసారి తొలిసారిగా ఆల్ ఇండియా టెక్నో ఎక్స్‌పో, జైలు ఉత్పత్తుల ప్రదర్శన స్టాళ్లు కూడా ఏర్పాటు చేయబడ్డాయని తెలిపారు. సన్నాహక కార్యక్రమంలో భాగంగా డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా తెలంగాణ కాంటిజెంట్ జట్టు సభ్యులైన 84 మందికి క్రీడా కిట్లను పంపిణీ చేసి, జాతీయ స్థాయిలో క్రమశిక్షణతో ఆత్మవిశ్వాసంగా రాణించాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి శాఖ, బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ డెవలప్‌మెంట్, న్యూఢిల్లీ కేంద్ర హోంమంత్రిత్వశాఖతో సమన్వయం చేసుకుంటూ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. 9వ తేదీన మంగళవారం ఉదయం 9:30 గంటలకు హిమాయత్ సాగర్‌లోని పోలీస్ అకాడమిలో రాష్ట్ర గవర్నర్ జిష్టుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని జైలు డ్యూటీ మీట్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.రామక్రిష్ణారావు, రాష్ట్ర హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రవి గుప్తా, రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

## 20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలం

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, సెప్టెంబరు 8(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నాయని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం 10 లక్షల ఎకరాల్లో సాగవుతోందని చెప్పారు. అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీనీ ఆదివారం తనిఖీ చేశారు. ఫ్యాక్టరీ తరచూ బ్రేక్ డౌన్ కావడంపై గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పామాయిల్ గెలలు నిల్వ ఉండకుండా క్రషింగ్ చేయాలని సూచించారు. ఎక్కువగా వచ్చిన పామాయిల్ గెలలు అప్పారావుపేట ఫ్యాక్టరీకి తరలించాలన్నారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో ఇరవై లక్షల ఎకరాలు ఆయిల్ పామ్ సాగుకు అనుకూల వాతావరణం ఉందని తెలిపారు. ఒక్కో ఉమ్మడి జిల్లాకు లక్ష ఎకరాల చొప్పున పది లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలని సూచించారు. సిద్దిపేట పామాయిల్ రిఫైనరీని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. పామాయిల్ గెలలు టన్ను రూ.25 వేలు ఉండేలా ప్రోత్సహించాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి స్వయంగా కలిసి వివరించానని వెల్లడించారు. అన్నదాతలు ఆత్మగౌరవంతో, ఆరోగ్యంగా ఉండేది ఒక్క వ్యవసాయ రంగమేనని చెప్పారు. రానున్న రోజుల్లో రైతులకు మంచి భవిష్యత్ ఉందన్నారు. ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ దేశానికి హబ్‌గా మారనుందని తెలిపారు. ఆయిల్ ఫెడ్‌తో పాటు ప్రైవేట్ రంగంలో పామాయిల్ రిఫైనరీ ఫ్యాక్టరీల ఏర్పాటుతో ఆయిల్ పామ్ రైతులకు దీర్ఘకాలిక మేలు జరుగుతోందని పేర్కొన్నారు.

## పత్తిలో తేమ 12 శాతం కంటే ఎక్కువైతే కొనుగోలు చేయం

### కాటన్ కార్పొరేషన్ మార్గదర్శకాలు విడుదల

**హైదరాబాద్, సెప్టెంబరు 8(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలో వచ్చే నెల నుంచి పత్తి అమ్మకాలు ప్రారంభం కానున్నాయి. ఈక్రమంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ( సీసీఐ ) పత్తి రైతులకు మార్గదర్శకాలను జారీ చేసింది. ఈసారి పత్తి కొనుగోలుకు సంబంధించి నియమాలను కఠినతరం చేసింది. పత్తిలో తేమ 12 కన్నా ఎక్కువ శాతం ఉంటే కొనుగోళ్లకు అనుమతించబోమని తెలిపింది. ఇదే సమయంలో తేమ శాతం 8 శాతం కన్నా తక్కువ ఉంటే ప్రోత్సాహకాలు అందిస్తామని స్పష్టం చేసింది. అదే తేమ శాతం 8 నుండి 12 మధ్య ఉంటే ధర నిష్పత్తి ప్రకారం తగ్గుతుందని తెలిపింది. కనుక రైతులు పత్తి అమ్మే ముందు తగు జాగ్రత్తలు తీసుకుని సీసీఐ నియమాలు పాటించలని తెలిపింది. పోయిన సంవత్సరం ఇలానే తేమ శాతం అంశంలో మధ్యలో మార్పులు చేయడం వల్ల చాలా రాష్ట్రాల్లో ఈ అంశం వివాదాస్పదం అయ్యింది. అందుకే ఈ సంవత్సరం పత్తి అమ్మకాలు ప్రారంభం కావడానికి నెల రోజుల ముందే మార్గదర్శాలు జారీ చేసింది. అలానే ఈ సంవత్సరం పత్తి ధరకు సంబంధించి కూడా సీసీఐ వెల్లడించింది. పొడవాటి దూదికి క్వింటాలుకు రూ.8,110ను ధరగా నిర్ణయించారు. అలానే మధ్యస్థ దూదికి రూ.7,710గా సీసీఐ మద్దతు ధర ప్రకటించింది. కాగా ఈసారి దేశవ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి.

## ఖాళీగా ఉన్న 30వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలి

### సిఎం రేవంత్‌రెడ్డికు ఎంపి ఆర్.కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్, సెప్టెంబరు 8(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలో అన్ని క్యాటగిరీల్లోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో 30వేలకుపైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ప్రభుత్వం తక్షణం స్పందించి భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం టీచర్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికు ఆర్.కృష్ణయ్య లేఖ రాసి దానిని ఆదివారం విడుదల చేశారు. గతేడాది టీచర్ పోస్టులను భర్తీ చేసినా వివిధ కారణాలతో అన్ని పోస్టులు భర్తీ కాలేదని, ఇంకా పెద్ద ఎత్తున ఖాళీలు ఉన్నాయని వెల్లడించారు. మరోవైపు బిఇడి, డిఇడి చేసి, అన్నీ అర్హతలున్న 16 లక్షల మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. 12 వేల పాఠశాలల్లో ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, సైన్స్ పాఠాలను చెప్పేవారే లేరని, విద్యార్థులు చదువుల్లో వెనుకబడి పోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.'ఇటీవల ముఖ్యమంత్రి వివిధ సభలలో ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ పాఠశాలలో విద్యాప్రమాణాలు పెంచడానికి టీచర్ పోస్టులను భర్తీ చేయవలసిన అవసరం ఉందన్నారు. ఇటీవల జూన్‌లో 6వేల మంది రిటైర్డు అయ్యారని, గత ఆగస్టులో 4,500 మంది టీచర్లకు ప్రమోషన్లు ఇచ్చారు. అలాగే గత డీఎస్సీ లో సెలక్టయిన వారిలో సుమారు రెండువేల మంది జాయిన్ కాలేదు. ఇలా మొత్తం 12వేలకు పైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి' అని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఎయిడెడ్ పాఠశాలలో గత 20ఏళ్ళుగా నోటిఫికేషన్ జారీ కాలేదు. ఆదర్శ, కస్తూర్బా పాఠశాలలకు పార్టుటైమ్ టీచర్లతో నెట్టుకొస్తున్నారు. ఖాళీగా ఉన్న 30వేల టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు.

## ఫేస్‌రికగ్నిషన్ యాప్‌తో పింఛన్‌దారుల సమస్యలకు చెక్

**హైదరాబాద్, సెప్టెంబరు 8(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వం చేయూత పథకం కింద 11 రకాల పింఛన్లు అందజేస్తోంది. అయితే చాలా మంది లబ్ధిదారులకు ఫింగర్ ప్రింట్ సరిగా పడకపోవడంతో పింఛన్లు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, కూలీలు, రైతుల వేలిముద్రలు చెరిగిపోవడంతో ధ్రువీకరణ విఫలమవుతోంది. దీంతో పింఛన్ ఆగిపోవడం వంటి సమస్యలు ఉత్పన్న మవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో కొందరు అక్రమదారులు ఇతర మార్గాల్లో పింఛన్‌దారులు సొమ్మును కాజేస్తున్న సంఘటనలు కూడా అనేకం వెలుగులోకి వచ్చాయి. ఇటువంటి సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రభుత్వం ఇటీవల ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను ప్రవేశపెట్టింది. అదనంగా.. కొత్తగా పోస్టుమాస్టర్లకు ఆధునిక ఫింగర్ ప్రింట్ పరికరాలు, 5జీ స్మార్ట్‌ఫోన్లను పంపిణీ చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు.ప్రజల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని తెలంగాణ ప్రభుత్వం చేయూత సామాజిక భద్రతా పింఛన్ల పథకంను అమలు చేస్తోంది. ఈ పథకం లక్ష్యం ఆర్థికంగా బలహీన వర్గాలకు భరోసా ఇవ్వడం. ఒంటరి మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, హెచ్ఐవీ బాధితులు, డయాలసిస్ రోగులు, గీత కార్మికులు, బీడీ కార్మికులు వంటి అనేక వర్గాలకు ఈ పింఛన్లు ఒక ఆశ్రయం లాంటివి. ప్రస్తుతం మొత్తం పదకొండు రకాల పింఛన్లు ఈ పథకం కింద అందజేస్తున్నారు.అయితే పింఛన్ దారులు డబ్బులు అందజేసే క్రమంలో వారి ఫింగర్ ప్రింట్ తీసుకునేందుకు ఇప్పటి వరకు 2జీ ఆధారిత ఫింగర్ ప్రింట్లను వాడేవారు. దీంతో అటు సిగ్నల్ రాక.. ఇటు ఫింగర్ ప్రింట్ సరిగ్గా పడక.. కూలి పనులు చేసే వారు, శారీరకంగా బలహీనులు, రోగులు వంటి వారికి పింఛన్ పొందడంలో అనేక సమస్యలు ఎదురయ్యేవి. ఈ ఇబ్బందులను గమనించిన ప్రభుత్వం ఆధునిక సాంకేతిక పరిష్కారాన్ని ప్రవేశపెట్టింది. ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు సాఫ్ట్‌వేర్ ద్వారా ఇప్పుడు ధృవీకరణ జరగనుంది. దీని వలన సరైన వ్యక్తికి - సరైన పింఛన్ - సరైన సమయంల్లో అందేలా ఒక పారదర్శక విధానం అమల్లోకి వస్తోంది.ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం రూ.15.50 కోట్ల బడ్జెట్ కేటాయించి.. 5బి ఆధారిత ఎల్1 ఫింగర్ ప్రింట్ పరికరాలు, స్మార్ట్ మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 6,300 బ్రాంచ్ పోస్టుమాస్టర్లకు పరికరాలు పంపిణీ చేయనున్నారు. ములుగు జిల్లా పస్రా కేంద్రంలో మంత్రి సీతక్క , కలెక్టర్ టీఎస్ దివాకర్ కలిసి ఈ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పోస్టుమాస్టర్లకు పరికరాలు చేరనున్నాయి. ఫేస్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి బాధ్యతను గిబి ఫ్లీ చేపట్టింది. నూతన టెక్నాలజీ వల్ల ధృవీకరణ ప్రక్రియ కేవలం మూడు సెకన్లలో పూర్తవుతుంది. ఇక లబ్ధిదారులు పొడవాటి క్యూల్లో గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేకుండా.. తక్షణమే పింఛన్లు పొందగలుగుతారు.

## 45 శాతం తగ్గిన విద్యుత్ ధరలు

### యూనిట్ రూ.3.63 నుండి రూ.2.01 పడిపోయిన రేటు

### 5,029 మిలియన్ యూనిట్లకు చేరుకున్న ట్రేడింగ్ వాల్యూ

**హైదరాబాద్, సెప్టెంబరు 8(జర్నలిస్ట్‌ఫైల్):** భారతదేశ విద్యుత్ స్పాట్ మార్కెట్ ఈ నెలలో 45 వరకు గణనీయమైన ధర తగ్గుదలను చూసింది. భారీ వర్షాలు డిమాండ్‌ను తగ్గించడం మరియు జల, పవన మరియు సౌర వంటి పునరుత్పాదక వనరుల నుండి ఉత్పత్తిని పెంచడం వల్ల ఇది సాధ్యపడింది. ప్రధానంగా భారీ వర్షాలు భారతదేశ విద్యుత్ ధరలు తగ్గడానికి కారణమమై మార్కెట్ అస్థిరతకు దారితీసింది. ఈ నెల మొదటి వారంలో స్పాట్ మార్కెట్‌లో విద్యుత్ ధరలు 45 శాతం వరకు తగ్గాయని ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ (ఐఈఎక్స్) స్పష్టం చేసింది. ఇదే సమయంలో అమ్మకపు బిడ్‌లు పెరిగాయి. రియల్‌టైమ్ మార్కెట్ (ఆర్‌టీఎమ్)లో సగటు ధర ఈ నెల తొలి వారం మధ్య యూనిట్‌కు 45 శాతం తగ్గి రూ.2.01కి చేరుకుంది. గత సంవత్సరం ఇదే కాలంలో యూనిట్‌కు రూ.3.63గా ఉంది. మరో పక్క ట్రేడింగ్ వాల్యూమ్‌లు 83 శాతం పెరిగి 825 మిలియన్ యూనిట్లకు చేరుకున్నాయి. కాగా ఇటీవలి నెలల్లో విద్యుత్ మార్పిడి ధరలు తగ్గుతూ వస్తున్నాయి. దీనికి మితమైన ఉష్ణోగ్రతలు మరియు పవన, జల మరియు సౌర వనరుల నుండి అధిక ఉత్పత్తి సహాయపడుతుంది. గత నెలలో దేశంలో విద్యుత్ వినియోగం 150.47 బిలియన్ యూనిట్లుగా ఉంది. ఇది గత సంవత్సరంతో పోలిస్తే 4 శాతం కంటే ఎక్కువ వృద్ధిని నమోదు చేసింది. గత నెల 7న దేశంలో గరిష్ట డిమాండ్ 229 గిగావాట్లకు చేరుకుంది. ఇది 2024లో నమోదైన మునుపటి ఆగస్టు రికార్డు 216 గిగావాట్లను అధిగమించింది. ఇక ఈ నెలలో ఐఈఎక్స్‌లో డే-అహెడ్ మార్కెట్ (డిఎఎమ్)లో అమ్మకాల వైపు ద్రవ్యత సంవత్సరానికి 40 శాతం పెరిగింది. దీనికి కారణం గాలి, జల మరియు సౌర ఉత్పత్తి పెరగడం. ఇంధనం యొక్క ఈ మిగులు లభ్యత ఎక్స్ఛేంజ్‌లో విద్యుత్ ధరలను పోటీగా ఉంచిందని ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్ బజాజ్ అన్నారు. గత నెలలో సగటు డే-అహెడ్ మార్కెట్ ధర యూనిట్‌కు రూ.4 వద్ద ఉంది, ఇది గత సంవత్సరంతో పోలిస్తే దాదాపు 7 శాతం తక్కువ. అయితే రియల్‌టైమ్ మార్కెట్ సగటున యూనిట్‌కు రూ.3.38 చొప్పున 6 శాతం తగ్గింది. అలాగే అర్‌టిఎమ్ ట్రేడింగ్ వాల్యూమ్‌లు కూడా పెరిగాయి, ఆగస్టు 2024లో 3,485 మిలియన్ యూనిట్ల నుండి గత సంవత్సరంతో పోలిస్తే 44 శాతం పెరిగి 5,029 మిలియన్ యూనిట్లకు చేరుకున్నాయి. గత నెలలో మొత్తం ట్రేడ్ చేయబడిన వాల్యూమ్‌లలో ఈ విభాగం 36శాతం వాటా కలిగి ఉంది. గత నెల 25న, భారీ వర్షాలు సరఫరాను మరింత పెంచడంతో సగటు అర్‌టీఎమ్ ధరలు దాదాపు సున్నాకి చేరుకున్నాయి. ఒకే ట్రేడింగ్ బ్లాక్‌లో (ఉదయం 7:45-8:00) ధర కేవలం రూ.0.01/ కిలోవాట్ పర్ అవర్‌కు పడిపోయిందని ఐఈఎక్స్ డేటా వెల్లడించింది. కాగా ఈ సంవత్సరం గరిష్ట విద్యుత్ డిమాండ్ 270 గిగావాట్ల కంటే ఎక్కువగా ఉంటుందని కేంద్రఇంధన మంత్రిత్వ శాఖ అంచనా వేసింది. అయితే, దేశవ్యాప్తంగా నిరంతర వర్షాల కారణంగా, ఇప్పటివరకు గరిష్ట డిమాండ్ 242 గిగావాట్లకు మాత్రమే చేరుకుంది గత యేడాది నమోదైన 250 గిగావాట్ల కంటే తక్కువ.



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

## ప్రమాదంలో పడిన ప్రజాస్వామ్యం, రాజ్యాంగం

### హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

**హైదరాబాద్, సెప్టెంబరు 8(జర్నలిస్ట్‌ఫైల్):** ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదంలో పడ్డాయని, వాటిని పరిరక్షించుకోవల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులతోపాటు ప్రజలందరిపైనా ఉందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ఆదివారం ఆదివారం సికింద్రాబాద్‌లోని నాలెడ్జ్ సెంటర్‌లో ఉపరాష్ట్రపతి అభ్యర్థి బి.సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా న్యాయవాదులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఉపరాష్ట్రపతి అభ్యర్థి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అయిన బి.సుదర్శన్‌రెడ్డి నక్సలిజానికి మద్దతు ఇస్తూ తీర్పు ఇచ్చారని ఆరోపించటం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్డిఏ అభ్యర్థి రాధాకృష్ణన్ గురించి చెప్పుకోదగ్గ విషయాలు ఏమీ లేకపోవటంతో సుదర్శన్‌రెడ్డిపై అమిత్‌షా నిస్సత్తువ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని భ్రష్టు పట్టించటానికి అనైతిక చర్యలకు పాల్పడుతున్నారని, దీనికి నిలువెత్తు నిదర్శనం 58వ స్థానంలో ఉన్న పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి విపుల్ మనుభాయ్ పంచోలిని భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించటమేనని గుర్తు చేశారు. తెలంగాణ బార్‌కౌన్సిల్ సభ్యులు బన్నూరు కొండారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్ట్ రెహ్మాన్, ఏపీసీఎల్పీ నేత సురేష్, నల్సార్ యూనియవర్సిటీ ఆఫ్ లా ప్రొఫెసర్ వాగేష్, గోవర్ధన్, సీనియర్ అడ్వకేట్ ప్రసాద్‌బాబు, బీవి శేషగిరి, డాక్టర్ అశోక్‌కుమార్, ఏఎంపీసీఎస్ డైరెక్టర్లు తొర్నాల గిరి, అర్మూల మహేశ్వర్, హయత్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మోడెం ప్రభాకర్‌గౌడ్, న్యాయవాదులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## బిసి గురుకుల పాఠశాలలో మంత్రుల ఆకస్మిక పర్యటన

### తనిఖీలు నిర్వహించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, సెప్టెంబరు 8(జర్నలిస్ట్‌ఫైల్):** కామారెడ్డి జిల్లా బిక్నూర్ మండలం జంగంపల్లిలో మహాత్మ జ్యోతిరావు ఫూలే గురుకుల పాఠశాలలో మంత్రులు ఆకస్మిక తనిఖీలు చేశారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ఆదివారం జంగంపల్లిలోని బిసి గురుకుల పాఠశలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రులు విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, విధిగా మెనూ పాటించాలని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో చెత్త చెదారం లేకుండా శుభ్రం చేయాలని, పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు. సిలబస్ ఎక్కడి వరకు పూర్తయిందని విద్యార్థులను అడిగి మంత్రులు తెలుసుకున్నారు.

ప్రతి ఒక్కరు లక్ష్యాన్ని నిర్దేశించుకోనీ విజయం దిశగా సాగాలని మంత్రులు విద్యార్థులకు సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థునులు అన్ని రంగాల్లో నైపుణ్యాలు నేర్చుకోవాలని, క్రీడల్లో రాణించాలని సూచించారు. విద్యార్థులకు విధిగా వైద్య పరీక్షలు నిర్వహించాలని మంత్రులు అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రులు విద్యార్థులను, టీచర్లను సత్కరించారు. ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మూడవ ర్యాంకు సాధించిన జి. సంధ్య రాణి, విద్యాదాన్ స్కాలర్ షిప్ అందుకున్న ఎస్. శ్రావణి, రాష్ట్ర స్థాయిలో క్రీడా పోటీలకు ఎంపికైన ఎస్. మాధవి, అనితలను మంత్రులు సత్కరించారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ప్రిన్సిపాల్ జె. శ్రీలత, విధుల్లో ఉన్న ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించారు.

ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను ఉపయోగించుకుని విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షి ంచారు.

మంత్రి తాను స్వయంగా డ్రాయింగ్ వేసి విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. విద్యతో పాటు క్రీడలో, కళల్లో రాణించాలని మంత్రి విద్యార్థులకు సూచించారు.

## ఉపరాష్ట్రపతిగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలి

### ఎంపిలు, వివిధ పార్టీ నేతలకు ప్రజాస్వామికవాదుల విజ్ఞప్తి

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 8(జర్నలిస్ట్‌ఫైల్):** ఈ నెల 9న జరగనున్న ఉప రాష్ట్రపతి ఎన్నికలు 'రాజ్యాంగం అమలుకు-రాజ్యాంగ విధ్వాసానికి' మధ్య జరుగుతున్న ఎన్నికలని పార్లమెంట్ సభ్యులు ఆలోచించి ఓట్లు వేయాలని పలువురు మేధావులు, ప్రజాస్వామిక వాదులు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు న్యాయం జరగాలన్న, రాజ్యాం గాన్ని కాపాడుకోవాలన్న విశ్రాంత న్యాయమూర్తి తెలంగాణ బిడ్డ, ప్రతిపక్షాల ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టీస్ బి.సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు.

జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సంఘీ భావంగా ఆదివారం సాయంత్రం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో తెలంగాణ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పౌర హక్కుల నాయకుడు ప్రొఫెసర్ జి.హరగోపాల్, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, ప్రముఖ సీనియర్ సంపా దకులు కె.రామచంద్రమూర్తి, కె.శ్రీనివాస్, విద్యా కమిషన్ సభ్యుడు ప్రొ. పి.ఎల్.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ సుద ర్శన్‌రెడ్డి విజయానికి టిడిపి అధినేత ఎన్.చంద్రబాబు , జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, వైఎస్ ఆర్‌సిపి అధినేత వై.ఎస్. జగన్‌మో హన్‌రెడ్డి, బి ఆర్ఎస్ నేత కెసిఆర్ పూర్తిగా సహకరిం చాలని విజ్ఞప్తి చేశారు. మన తెలుగువారైనా సుద ర్శన్‌రెడ్డి గెలుపు తెలుగు జాతి వికాసానికి మరింతగా దోహద పడు తుంద న్నారు. ఇప్పటికే 67 శాతం మంది ప్రతి పక్ష పార్ల మెంట్ సభ్యులు మద్దతు తెలప దంతో పాటు, ప్రాంతీయ పార్టీ లు, స్వతంత్ర అభ్యర్థులు కూడా మద్దతు తెలి పారని వివరించారు. ఉప రాష్ట్రపతిగా సుద ర్శన్‌రెడ్డి విజయం సాధిస్తే లౌకిక, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాగాన్ని రక్షించగలరని, చరిత్ర, న్యాయ శాస్త్రంపై ఆయనకు పూర్తిగా అవగాహన ఉందని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ. జి.హరగోపాల్, చిత్రంలో విశ్వేశ్వరరావు, ప్రొ. కోదండరామ్, కె.శ్రీనివాస్‌రెడ్డి

## టెట్‌పై సుప్రీంకోర్టు తీర్పును పునఃసమీక్షించాలి

### సీనియర్ ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలి

### టిఎస్ యుటిఎఫ్ డిమాండ్

**హైదరాబాద్, సెప్టెంబరు 8(జర్నలిస్ట్‌ఫైల్):** టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)పై సుప్రీంకోర్టు తీర్పును సమీక్షించాలని టిఎస్ యుటిఎఫ్ డిమాండ్ చేసింది. సీనియర్ టీచర్లకు రక్షణ కల్పించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకట్ డిమాండ్ చేశారు. ఐదేళ్ళ పైబడి సర్వీసున్న ఇన్ సర్వీస్ టీచర్లందరూ రెండేళ్ళలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఉత్తీర్ణులు కావాలని .. లేదంటే ఉద్యోగాన్ని వదులుకోవాలని ఆదేశిస్తూ సుప్రీంకోర్టు ఈ నెల 1న ఇచ్చిన తీర్పును పునః సమీక్షిం చాలని వారు డిమాండ్ చేశారు. సర్వీసులో ఉన్న సీనియర్ టీచర్ల ప్రయోజనాల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేయాలన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయ నియామకానికి ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఉత్తీర్ణత తప్పనిసరి చేస్తూ 2010 ఆగస్టు 23న ఎన్‌సిటిఈ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. అయితే అప్పటికే నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత నుండి మిన హాయింపు ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం పదోన్నతి పొందాలంటే టెట్ అవసరమా లేదా అనే వివాదంపై వివిధ కోర్టుల్లో కేసులు నడుస్తు న్నాయన్నారు.

మైనారిటీ విద్యా సంస్థల్లో నియామకాలకు టెట్ తప్పనిసరా కాదా అనే అంశంపై మహారాష్ట్రకు సంబంధించిన కేసుతో పాటు, ప్రమోషన్ల విషయంలో తమిళనాడు ఉపాధ్యాయుల కేసులను కలిపి విచారించిన సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్.. సెప్టెంబర్ 1న వెలు వరించిన తీర్పు సీనియర్ ఉపాధ్యాయులకు అశనీపాతంగా మారిందన్నారు. ఉపాధ్యాయుల భవిష్యత్తు పట్ల సందిగ్ధత నెలకొందన్నారు. మైనారిటీ విద్యాసంస్థల కేసును రాజ్యాంగ ధర్మాస నానికి బదలీ చేసిన న్యాయమూర్తులు.. మైనారిటీయేతర విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులకు సంబం ధించి ఇంతటి కఠినమైన తీర్పును ఇవ్వడం విచారకరమన్నారు. ఇరవై, పాతికేళ్ళుగా సర్వీసు చేస్తున్న ఉపాధ్యాయులు ఇప్పుడు కేవలం రెం డేళ్లలో టెట్ ఉత్తీర్ణులు కావాలనడం భావ్యం కాద న్నారు. 2011లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోనూ, తెలంగాణ ఏర్పాటు అనంతరం 2015లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష నిబంధనలు రూపొందించిన ఉత్తర్వుల్లో ఆగస్టు 23,2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత మినహాయించినట్లు స్పషంగా పేర్కొన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే గత 15 సంవత్సరాలుగా ఉపాధ్యాయులు టెట్ రాయాలనే ఆలోచన చేయలేదన్నారు. ఇప్పుడు హఠాత్తుగా రెండేళ్లలో టెట్ పాస్ కావాలంటే దేశ వ్యాప్తంగా ఉపాధ్యాయులందరూ తీవ్ర భయాందోళనలకు లోనవుతున్నారని అన్నారు. కనుక ఎన్‌సిటిఇ నోటిఫికేషన్ (23.08.2010) తర్వాత నియామకమైన టీచర్లకు మాత్రమే టెట్ తప్పనిసరి చేయాలని, అంతకుముందు నియామకమైన వారికి మినహాయింపు ఇవ్వాలని చావ రవి, ఎ వెంకట్ డిమాండ్ చేశారు.

## బిజెపి రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావుకు బాలాపూర్ లడ్డూ ప్రసాదం

**హైదరాబాద్, సెప్టెంబరు 8(జర్నలిస్ట్‌ఫైల్):** బాలాపూర్ గణేష్ ఉత్సవాల్లో భాగంగా జరిగిన లడ్డూ వేలంలో రూ.35 లక్షల రూపాయల విలువైన లడ్డూను దక్కించుకున్న కర్మన్‌ఘాట్ ప్రాంతానికి చెందిన లింగాల దశరథ్ గౌడ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచంద్రరావును మర్యాదపూర్వకంగా కలిసారు. ఆదివారం పార్టీ కార్యాలయానికి వచ్చిన దశరథ్ మర్యాద పూర్వకంగా కలిసి లడ్డూ ప్రసాదాన్ని అందజేసి ఆనందం వ్యక్తం చేశారు.

## పంట పొలాల్లో ఇసుకు మేటల తొలగింపు

### రాష్ట్ర సర్కార్ కీలక నిర్ణయం

**హైదరాబాద్, సెప్టెంబరు 8(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షాలు, వరదలతో పంట పొలాల్లో ఇసుక మేటలు వేసి రైతులు భారీగా నష్టపోయారు. ఈ క్రమంలో రాష్ట్రంలో దెబ్బ తిన్న వ్యవసాయ భూములను పునరుద్ధరించడానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వరదలు, వర్షాల వల్ల దెబ్బతిన్న వ్యవసాయ భూములను బాగు చేయడానికి ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకోవాలని నిర్ణయించింది. పొలంలో ఇసుక మేటల తొలగింపు పనులకు ఉపాధి హామీని అనుసంధానం చేసేందుకు అనుమతిచ్చింది. దీని ద్వారా ఉపాధిహామీ కార్మికులు రైతుల పొలాల్లో పేరుకుపోయిన ఇసుకను తొలగించి భూమిని తిరిగి సాగుకు అనుకూలంగా మారుస్తారు. ఈ నిర్ణయం వల్ల రైతులకు ఒకింత ఆర్థిక వెసులుబాటు కలుగనుంది. ఈ మేరకు దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. కాగా గత కొన్ని రోజులుగా తెలంగాణలో కురిసిన భారీ వర్షాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 29 జిల్లాల్లో 60 వేల ఎకరాల పంట పొలాలు దెబ్బ తిన్నాయి. ఈ భూముల్లో ఇసుక మేటలు వేయడంతో సాగుకు వీల్లేకుండా తయారయ్యాయి. దీంతో ఆ భూముల్లో మేట వేసిన ఇసుక, మట్టిని తొలగించి, తిరిగి దాన్ని సాగుకు అనుకూలంగా మార్చి రైతుల జీవనోపాధికి నష్టం వాటిల్లకుండా చూడాలని వ్యవసాయ శాఖ ప్రభుత్వాన్ని కోరింది. దీంతో సర్కార్ ఈ అంశాన్ని పరిశీలించి ఈ ఉపాధి హామీ పథకం కింద ఇసుక మేటల తొలగింపు కార్యక్రమం చేపట్టేందుకు అంగీకారం తెలిపింది. ఉపాధిహామీ పథకం నియమాల ప్రకారం.. భారీ వర్షాల వల్ల పంట పొలాలు దెబ్బ తింటే. వాటిని తిరిగి సాగుకు అనుకూలంగా పునరుద్ధరించడం, నిరుపయోగ భూములను మరమత్తు చేసి సాగుకు అనుకూలంగా మార్చేలా చేసేందుకు అవకాశం ఉంది. దీని ప్రకారమే ప్రభుత్వం వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలు, వ్యవసాయ భూముల్లో ఉపాధిహామీ పనులను చేపట్టేందుకు అంగీకారం తెలిపింది.

## జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి దక్షిణాది ఎంపిలు మద్దతు ఇవ్వాలి

### ప్రజారాజ్యం పార్టీ అధ్యక్షుడు జిలుకర రవికుమార్

**హైదరాబాద్, సెప్టెంబరు 8(జర్నలిస్ట్‌ఫైల్):** దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు రాజకీయాల కతీతంగా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి ఓటు వేసి ఉపరాష్ట్రపతిగా గెలిపించాలని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్ విజ్ఞప్తి చేశారు. అలాగే బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ తక్షణమే జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు తెలుపుతూ స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.జస్టిస్ బి సుదర్శన్ రెడ్డికి మద్దతు తెలిపిన ఎంఐఎం అధినేత ఎంపీ అసదుద్దీన్‌ఓవైసీకి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన తెలిపారు దక్షి ణాది రాష్ట్రాలకు చెందిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు. కర్ణాటక, కేరళ, కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరితో పాటు మహారాష్ట్ర, గోవా రాష్ట్రాలకు చెందిన ఎంపీలు జస్టిస్ బి సుదర్శన్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ఆయన చేస్తున్న కృషి మరువలేనిదని, ఉపరాష్ట్రపతిగా గెలిస్తే ఆ పదవికి వన్నె తెస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు దాసరి శ్యామ్‌రావు. గరుగుల నర్సింలు, ఆర్తిగారి సుధాకర్, ఉదయ్‌కుమార్, సీమోను సిలారి తదితరులు పాల్గొన్నారు.

# ఆందోళన అనవసరం.. సమృద్ధిగా ఎరువులు

- డివిజన్ వ్యాప్తంగా సజావుగా యూరియా పంపిణీ
- రైతులకు అవగాహన కార్యక్రమంలో ఆర్‌డీవో కావూరి చైతన్య





**విజయవాడ, సెప్టెంబర్ 8(జర్నలిస్ట్‌ఫైల్):**

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వారి సూచనల మేరకు విజయవాడ డివిజన్ వ్యాప్తంగా యూరియా, ఇతర ఎరువుల పంపిణీకి చర్యలు చేపట్టామని, ఎరువుల సరఫరా సజావుగా సాగుతోందని విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య తెలిపారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా గ్రామగ్రామాన అగ్రికల్చర్ అవుట్‌రీచ్ (జన జాగృతి) కార్యక్రమం జరిగింది. రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన, సహకార, మార్క్‌ఫెడ్ తదితర శాఖల అధికారుల పర్యవేక్షణలో క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి ఎరువులపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య డివిజన్‌లో విస్తృతంగా పర్యటిస్తూ అన్నదాతలను కలిసి ప్రభుత్వ ఏర్పాట్లను వివరించారు. మైలవరం మండలం పుల్లూరు, విజయవాడ రూరల్ కె.తాడేపల్లి, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. రైతులతో మమేకమై సమీప సొసైటీల్లో ఉన్న ఎరువులు, త్వరలో రానున్న ఎరువుల సమాచారంతో పాటు పంట దశనుబట్టి ఎరువుల వినియోగం ఎలా ఉండాలనే దానిపైనా అవగాహన కల్పించారు. పర్యావరణానికి, నేల సారానికి ఉపయోగపడటమే కాకుండా తక్కువ ఖర్చుతో సాగును లాభసాటిగా మార్చే నానో యూరియా, ఎరువుల ప్రయోజనాలకు కూడా ఆర్‌డీవో చైతన్య వివరించారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వినతుల స్వీకరణ


### ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, సెప్టెంబర్ 8(జర్నలిస్ట్‌ఫైల్):**

సెప్టెంబర్ 8వ తేదీ సోమవారం కలెక్టరేట్ లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్టు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను Meekosam.ap.gov.in వెబ్ సైట్ నందు నమోదు చేసుకోవచ్చని .. నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చన్నారు.

## ప్రభుత్వ రైతు బజార్ ఏర్పాటు చేయాలి

### చైర్మన్ గూడవల్లి నరసింహారావుకు వినతిపత్రం అందజేత



**హనుమాన్ జంక్షన్, సెప్టెంబర్ 8(జర్నలిస్ట్‌ఫైల్):**

హనుమాన్ జంక్షన్, బాపులపాడులో ప్రభుత్వ రైతు బజారు ఏర్పాటు చేయాలని గన్నవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ గూడవల్లి నరసింహారావుకు గన్నవరం జనసేన సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, అన్నపూర్ణ ఏజెన్సీ అధినేత నూలు నరసింహారావు చేతుల మీదుగా ఇంటి దేవసహాయం వినతిపత్రం అందించడం జరిగింది. సానుకూలంగా స్పందించిన చైర్మన్ కూటమే నేతలతో చర్చించి స్థలం పరిశీలించి త్వరలోనే హనుమాన్ జంక్షన్ లో ప్రభుత్వ రైతు బజార్ ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమాన్ జంక్షన్ లో సామాన్య ప్రజలు కూరగాయలు కొనుగోలు చేసేందుకు ఇబ్బంది పడుతున్నారని ప్రైవేటు రైతు బజార్ లో అధిక ధరలు అమ్మడం వల్ల సామాన్యులు పడుతున్న ఇబ్బందులు తమ దృష్టికి వచ్చాయని త్వరలోనే ప్రభుత్వ రైతు బజార్ ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన అన్నారు.

# దసరా కానుకగా డీఏ మంజూరు చేయండి

- ఉద్యోగుల సమస్యల పరిష్కారం వైపు ప్రభుత్వం అడుగులు వేయాలి
- పీఆర్‌సీ కమిషనర్ నియామకం పెండింగ్ బిల్లులపై చర్యలు తీసుకోండి
- ఏపీ ఎన్‌జీజీవో అధ్యక్షులు, ఏపీ జేఏసీ ఛైర్మన్ ఎ.విద్యాసాగర్



**తిరుపతి, సెప్టెంబర్ 8(జర్నలిస్ట్‌ఫైల్):**

రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యోగులు నిర్మాణాత్మక సహకారం అందిస్తున్నారని.. గత ప్రభుత్వం ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం చేసిందని, అయితే కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు దసరా కానుకగా డీఏ మంజూరు చేయాలని ఏపీ ఎన్‌జీజీవో అధ్యక్షులు, ఏపీ జేఏసీ ఛైర్మన్ ఎ.విద్యాసాగర్ విజ్ఞప్తి చేశారు. తిరుపతి పర్యటన నేపథ్యంలో ఆదివారం తిరుపతి ఎన్‌జీవో హోమ్‌లో విద్యాసాగర్ మీడియా సమావేశం నిర్వహించారు .మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ ఆర్నెల్ల కోసారి ఇవ్వాల్సిన డీఏ మంజూరు కావడం లేదని.. ఇప్పటికే నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. నూతన ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తి కావస్తున్నా ఇప్పటివరకు ప్రభుత్వ ఉద్యోగులు తమకు రావాల్సిన బకాయిల విషయంలోగానీ అపరిష్కృతంగా ఉన్న సమస్యలనుగానీ పరిష్కరించాలని వత్తిడి చేయలేదని గుర్తు చేశారు. ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదేమో అన్న ఆందోళనలో ఉద్యోగులు ఉన్నారని పేర్కొన్నారు. 25 నెలలు గడుస్తున్నా వేతన సవరణ కమిషన్ వేయకపోవడంపై ఉద్యోగుల్లో అసంతృప్తి ఉందన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లకు న్యాయం జరిగేలా తక్షణమే కొత్త కమిషనర్ నియామకం చేపట్టాలన్నారు. గత మూడునాలుగేళ్లుగా సంపాదించిన సెలవు మొత్తాలు, డీఏ బకాయిలు, పీఆర్‌సీ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటికి త్వరితగతిన ఆర్థిక ఆమోదం తెలపాలని కోరారు. రూ. 30 వేల కోట్ల బకాయిల విషయంలోనూ చర్యలు తీసుకోవాలన్నారు. అందరి వైపూ వెళ్తున్న ప్రభుత్వ జగన్నాథ రథచక్రాలు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లవైపు వెళ్లడం లేదనే భావన నెలకొందన్నారు. అందువల్ల ప్రభుత్వ జగన్నాథ రథచక్రాలు ఉద్యోగుల పీఆర్‌సీ వైపు, డి ఏ వైపు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ వైపు, హామీల అమలువైపు వెళ్లాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ ఫోరంను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక సమస్యలతో పాటు ఆర్థికేతర సమస్యలూ పెండింగ్‌లో ఉన్నాయని.. ఒక్క బకాయిలు, కేసులు, ఒకటో తేదీన జీతాలు విషయంలో తప్పితే మరే సమస్యపైనా దృష్టిపెట్టడం లేదనే బాధ ఉద్యోగుల్లో ఉందన్నారు. రూ. 30 వేల కోట్ల బకాయిలకు సంబంధించి ఒక రోడ్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి అందరికంటే మాకు బాగా తెలుసు.. వీటిని గమనిస్తూనే ముందుకెళ్తున్నాం.. ఎంతో అనుభవం ఉన్న గౌరవ ముఖ్యమంత్రి ఉద్యోగుల సమస్యలపై దృష్టిపెట్టాలని కోరుతున్నం. పి.ఆర్.సి కమిషనర్ పునర్నియామకంలో ఆలస్యం, పి.ఆర్.సి నివేదిక తుదీకరణలో జాప్యం దృష్ట్యా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు తాత్కాలిక ఉపశమన భత్యం మంజూరు చేయవలసిందిగా కోరుకుంటున్నామన్నారు. వీటితోపాటుగా రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యుటీ, సరెండర్ లీవ్ మొత్తాలు మొదలైనవి తక్షణమే విడుదల చేసి, వారికీ రిటైర్మెంట్ అనంతరం అవసరాలు తీర్చుకునేలా ప్రాధాన్యత ఇవ్వవలసిందిగా కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ విషయంలో2023లో ప్రభుత్వం జూన్ 2014 లోపునియమించబడిన కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని నిర్ణయం తీసుకుని దాదాపు 3000 మందిని రెగ్యులరైజ్ చేసింది. మిగిలిన వారిని రెగ్యులరైజ్ చేయవలసిందిగా కోరడం జరిగిందని తెలిపారు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అడుగులు వేయాలన్నారు ఏపీ ఎన్జీవో రాష్ట్ర సంఘం డిమాండ్ మేరకు ప్రభుత్వం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిరహించడం జరిగిందన్నారు పెన్షనర్లకు సంబంధించి 70 నుండి 75 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న పెన్షనర్లు/ఫ్యామిలీ పెన్షనర్లకు బేసిక్ పెన్షన్‌పై 10%, 75 నుండి 80 సంవత్సరాల మధ్య వయస్సు వారికి 15% అదనపు పెన్షన్ గతంలో ఇవ్వబడేదన్నారు. 11వ పి.ఆర్.సి అమలు తర్వాత రద్దు అయిన ఈ సదుపాయాన్ని తిరిగి పునరుద్ధరించవలసిందిగా కోరుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు 60 నుండి 62 సంవత్సరాలకు పెంచారు.అదే విధంగా పబ్లిక్ సెక్టార్ యూనిట్స్ మరియు గురుకుల సొసైటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకూ ఈ సౌకర్యాన్ని కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. వీటితో పాటుగా ఇతర ప్రధాన సమస్యలైన 1-9-2004 లోపు పోస్టింగ్ పొందిన ఉద్యోగులకు ఓపిఎస్ అమలు, హెచ్ ఓ డీలలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇంటి స్థలాలు, ఏపీ జి ఎల్ ఐ పాలసీలకు బోనస్ ప్రకటన, ఈహెచ్ఎస్ స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్వహణ, రీయంబర్స్మెంట్ రెండు లక్షల నుంచి 5 లక్షల పెంపు, బిల్లుల మంజూరులో ఆలస్యాన్ని సవరించటం, ఒప్పంద ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు, రెండు సంవత్సరాల ఉద్యోగ కాలం పూర్తి చేసిన గ్రామ వార్డు సచివాలయు ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు చిత్తూరు జిల్లా అడహాక్ కమిటీ ఏర్పాటు: తిరుపతి జిల్లాలోని ఏపీ ఏన్జి జి వో సమావేశంలో తిరుపతి జిల్లా ఆడహాక్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఛైర్మెన్‌గా యస్ సురేష్ బాబు, కోకన్వీనర్‌గా సి రఘు, కోశాధి కారిగా వి లలిత కుమార్ కమిటీ సభ్యులుగా చెంచు రత్నం పణిం ద్ర జనార్దనయ్య ఉపాధ్యక్షులుగా శవణ్ కుమార్ ఎన్నిక య్యారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యని ర్వాహక కార్యదర్శి కె. జగదీశ్వరరావు,,రాష్ట్ర ఉపాధ్యక్షులు వై ప్రసాద్ యాదవ్,కడప జిల్లా అధ్యక్షులు బి శ్రీ నివాసులు, నెల్లూరు జిల్లా అధ్యక్షులు యం పెంచల్‌రావు, జిల్లా కార్యదర్శి జి రామ కృష్ణ. తిరుపతి తాలూ కా అధ్యక్షులు యస్ సురేష్ బాబు, కార్యదర్శి బాలాజీ మరియు జిల్లా నాయకులుఅన్ని తాలూ కాకార్వర్గ సభ్యులు పాల్గొన్నారు.

# యూరియాని సరఫరా చేయలేని అసమర్ధ ప్రభుత్వం

## వైసీపీ మాజీ మంత్రి జోగి రమేశ్



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 8(జర్నలిస్ట్‌ఫైల్):**

రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేయలేని కూటమి ప్రభుత్వం చంద్రబాబు అసమర్ధ పాలనకు నిదర్శనం అని వైసీపీ మాజీ మంత్రి జోగి రమేశ్ అన్నారు. ఆదివారం సాయంత్రం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతుల పక్షాన యూరియా కోసంపోరాటానికి ఈ నెల 9వ తేదీన అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు వినతి పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. వైఎస్ఆర్సిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అన్ని ఆర్డిఓ కార్యాలయాలకు ర్యాలీతో వెళ్లి వినతి పత్రాలు అందజేసే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈనెల 9వ తేదీన రైతుల పక్షాన జరగబోయే అన్నదాతపోరు కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రం నుండి రాష్ట్రానికి కావాల్సిన యూరియాలు సమకూర్చుకోవడంలో విఫలమయ్యారు అంటే చంద్రబాబు కేవలం కాలం గడుపుతున్నారు. రైతే రాజు అని రైతుకు కావలసినవన్ని సకాలంలో అందజేసిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నారు. రాష్ట్రానికి అన్నం పెట్టే రైతులు ఎరువుల కోసం అన్నం తినకుండా ఎదురుచూస్తే పరిస్థితి దాపురించిందని మాజీ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఈ నెల 9వ తేదీన జరగబోయే అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వైస్ చైర్పర్సన్ శ్రీదేవి, రైతు విభాగం కార్యదర్శి గోగినేని సాంబయ్య వైసీపీ రాష్ట్ర కార్యదర్శి స్వర్ణాల తిరుపతిరావు ఎస్సీ సెల్ మైలవరం నియోజకవర్గం అధ్యక్షులు నల్లమోతు దయాకర్ మరియు అన్ని మండలాల అధ్యక్షులు కార్యదర్శులు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నకు అండగా వైసిపి





## అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరించిన డాక్టర్ మొండితోక జగన్మోహనరావు

**నందిగామ, సెప్టెంబర్ 8(జర్నలిస్ట్‌ఫైల్):**

రైతులకోసం తమపార్టీ అలుపెరుగని పోరాటం చేస్తుందని,కుటమి ప్రభుత్వం అన్ని అబద్దపు హామీలతో అధికారంలోకి వచ్చిందని,రైతు సమస్యలు పరిష్కరించే వరకు వెనుకడమని వైసిపి నియోజకవర్గ ఇంచార్జీ మొండితోక జగన్మోహనరావు అన్నారు. ప్రధానంగా ఈ నెల 9వ తేదీన నందిగామ పట్టణంలో జరిగే అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను, రైతులను, రైతు సంఘం నాయకులను, కార్యకర్తలను నందిగామ మాజీ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహ నరావు కోరారు. నందిగామ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో మాట్లాడుతూ, సహజంగా రాష్ట్రానికి కేటా యించిన ఎరువులను 50% ప్రభుత్వం ఆధీనంలో ని మార్క్ ఫెడ్ కు 50 % ప్రైవేట్ కు కేటాయిస్తారు. ఈ ఎరువులను మార్కెట్ యార్డుల ద్వారా , పిఏసిఎస్ లు ఎంఫ్ఓల ద్వారా రైతులకు పంపిణీ చేస్తారు. కానీ అలాకాకుండా తెలుగుదేశం పార్టీ నాయకుల సంపద సృష్టిలో భాగంగా మార్ఫెడ్ కు ఇవ్వాల్సిన 50% ఎరువులను తగ్గించి ప్రైవేటుకు కేటాయించడం అత్యంత దుర్మార్గమని, ప్రైవేటుకు కేటాయించిన యూరియాను బ్లాక్ చేసి బస్తాకు 270 రూపాయల ధర ఉంటే దానిని 450-600 రూపాయలకు అమ్ముతున్నారు. అంటే బస్తాకు 200-300 వరకూ అధికం అమ్ముతున్నారుని అన్నారని, రైతుల్ని రైతులను పీల్చి పిప్పి చేసి అధిక ధరలకు యూరియాని అమ్మి వసూలు చేసిన సొమ్ము ఎవరు జేబులోకి చేరుతుందని ప్రశ్నించారు. సంపద సృష్టిలో భాగంగా కూటమి ప్రభుత్వం దాదాపు 250 నుండి 300 కోట్లు వరుకు స్కామ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి వ్యవసాయాన్ని నెరవేర్యం చేసే పద్ధతుల అవలంబించిందన్నారు, పంటలకు మద్దతు ధరలు కల్పించడంలో విఫలమయ్యారని, పంటల నష్టానికి పరిహారాలు అందించడంలో విఫలమయ్యారని, పేర్కొన్నారు. గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అనేక రకాల సేవలు అందించి సకాలంలో విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయడం జరిగిందని ఎరువుల కోసం రైతులు ఏనాడూ రోడ్డు ఎక్కే పరిస్థితి కలగలేదని పేర్కొన్నారు. కానీ నేటి కూటమి ప్రభుత్వం రైతులను అన్ని రకాలుగా మోసం చేసి ఇబ్బందులకు గురించేస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వంపై రైతుల పక్షాన పోరాటటానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం నాయకులు, నాలుగు మండలాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డు స్థలాల్లో అక్రమ నిర్మాణం?

- భక్తి ముసుగులో బహుళ అంతస్తుల భవనం
- జానెడు భూమిలో కర్ర పాతినా వెంటనే వాలిపోయే మున్సిపాలిటీ అధికారులకు ఇది కనిపించడం లేదా...?



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 8(జర్నలిస్ట్‌ఫైల్):**

కొండపల్లిలోని బి కాలనీ గజరాజు చెరువుకు ఆనుకొని కొండపల్లి స్టేషన్ సెంటర్‌కు వెళ్లే రహదారి పక్కనే ఉన్నటువంటి వక్ఫ్ బోర్డ్ స్థలాలలో భక్తిముసుగులో అక్రమ నిర్మాణాలు చేపడుతూ బహుళ అంతస్తుల భవనం నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకునే అధికారులే లేకపోయారు.ఎన్టీఆర్ జిల్లాలో వక్ఫ్ బోర్డుకు అత్యధిక భూములు కలిగి ఉన్న ప్రాంతంగా కొండపల్లికి పేరు. కొండపల్లిలో వక్ఫ్ భూములలో అనధికారికంగా నిర్మాణాలు జరుగుతున్నా మున్సిపాలిటీ అధికారులు కానీ రెవెన్యూ అధికారులు కానీ ఇంతవరకు అటువైపు కన్నెత్తి చూడకపోవడం చర్చనీయంగా మారింది. స్వామి కార్యమెంత స్వకార్యం ఇంకా ఎంత అన్నట్లుగా స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.సామాన్యులు రేకుల షెడ్డు వేస్తేనే ఊరుకోని మున్సిపాలిటీ అధికారులకు బహుళ అంతస్తుల భవనాలు నిర్మాణాలు చేపడుతున్నా కనిపించకపోవడం ఆశ్చర్యకరమైన విషయం. సామాన్యులు ఏదైనా నిర్మాణాలు చేస్తున్నారని అనుమానం వస్తేనే ప్రెస్ మీట్లంటూ రాస్తారోకోలు ధర్నాలు చేస్తూ అరచి గగ్గోలు పెట్టేవారే భూకబ్జాతి పాల్పడి అక్రమ నిర్మాణం చేపడుతుంటే ప్రజల్లో వారు చేస్తే సక్రమమా సామాన్య ప్రజలు చేస్తే అక్రమమా అంటూ ప్రజలు విధాలుగా ఆ వ్యక్తులపై మండిపడుతున్నారు. అసలు వక్ఫ్ భూముల స్థలాలలో నిర్మాణాలు చేపడుతున్నా అటువైపు చూడని అధికారుల నిర్లక్ష్య ధోరణి పట్ల పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయం అలాగే దేవస్థానం మధ్యలో ఈ గృహం ఉండటంతో ప్రభుత్వ స్థలం పక్కనే ఉన్నా కూడా ఈ భూమి ఎవరిది అని నేటి వరకు విచారించకపోవడం అధికారుల అలసత్వంకు నిదర్శనంగా స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ భూమిపై కన్నేసి శాశ్వత బహుళ అంతస్తుల భవనం నిర్మాణం చేస్తున్న వారిపై అధికారులు పై విచారించి చర్యలు తీసుకోవాలని లేకపోతే ప్రభుత్వ భూములన్ని అక్రమార్కుల చేతుల్లో కబ్జాలకు గురై అన్యాక్రాంతమయ్యే ప్రమాదం ఉందని వాపోతున్నారు, అధికారులు ప్రజలకు వాస్తవాలను కూడా వెల్లడించాలని కోరుతున్నారు.

## ఉమ్మడి కృష్ణాజిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబుకు ఉత్తమ సర్వీస్ అవార్డు



**గన్నవరం, సెప్టెంబర్ 8(జర్నలిస్ట్‌ఫైల్):**

కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, రాష్ట్ర ప్రభుత్వం చే ఉత్తమ సర్వీసు అవార్డు వరుసగా మూడవసారి అందుకున్న సందర్భంగా ఎమ్మార్పీఎస్ మరియు మాదిగ ప్రజాప్రతినిధులు విక్టర్ బాబుని ఘనంగా సన్మానించారు స్థానిక గన్నవరం టౌన్ లో అంబేద్కర్ కమ్యూనిటీ హాలులోకార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విక్టర్ బాబుకి అవార్డు రావడం చాలా సంతోషం సంతోషకదాయమని కొనియాడారు ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు నిడమర్తి నాగేశ్వరరావు కలపాల అబ్రహం జూనపూడి కృష్ణ ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కోట కృష్ణమోహన్ మాదిగ గన్నవరం నియోజకవర్గ ఎం ఎస్ పి ఇంచార్జ్ మంద వేణు మాదిగ కో ఇన్చార్జ్ కొప్పుల కామేశ్వరరావు మాదిగ ఎం ఈ ఎఫ్ గన్నవరం నియోజకవర్గ ఇన్చార్జి దేవరపల్లి ఏసుబాబు ఉంగుటూరు ఎంఎస్పి ఇన్చార్జి పులపాక పాస్కల్ మాదిగ గన్నవరం టౌన్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు వేమండఅబినాష్ మాదిగలాముకోటేశ్వరరావు మొదలగువారు పాల్గొన్నారు.

## ఆగిరిపల్లి లో జిల్లాస్థాయి యోగా పోటీలు

### విజేతలకు బంగారు పతకాలు



**ఆగిరిపల్లి, సెప్టెంబర్ 8(జర్నలిస్ట్‌ఫైల్):**

ఏలూరు జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆగిరిపల్లి గ్రామంలో శ్రీ వ్యాఘ్రలక్ష్మీ నరసింహ స్వామివారి క్షేత్ర ప్రాంగణంలో యోగా పోటీలు నిర్వహించారు. మదుపల్లి రామనాగ లక్ష్మీనారాయణ కస్తూరి గార్ల కళ్యాణమండపంలో జరిగిన ఈ పోటీల్లో ఆగిరిపల్లి, శోభనాపురం, వడ్లమాను, నూజివీడు, ముసునూరు ప్రాంతాలకు చెందిన సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, పెద్దలు సహా మొత్తం 56 మంది పాల్గొన్నారు. వీరిలో ఎనిమిది మంది బంగారు పతకాలు, నలుగురు వెండిపతకాలు, ముగ్గురు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. మొత్తం 15 మంది విజేతలుగా నిలిచారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు, ప్రతిభ కనబరిచిన వారికి మెరిట్ సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమం అసోసియేషన్ అధ్యక్షులు యండూరు నరసింహమూర్తి, కార్యదర్శి బొద్దూరు సాంబశివరావు, కోశాధికారి అద్దంకి పోతులూరి వీరబ్రహ్మాచారి మరియు కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో జరిగింది. టి.వి. కుమార్, కాళీ ప్రసాద్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా మదుపల్లి గోపాల్, వై.ప్రణీత్, వేదాంతం శేషుబాబు, తవ్వ మురళీధర్, సగ్గుర్తి కమల కుమారి హాజరై పోటీలను విజయవంతం చేశారు.

# పెద్దాయనా బాగున్నారా.. పాడి పంటలు ఎలా ఉన్నాయి?





- సమృద్ధిగా ఎరువులున్నాయి.. ఆందోళన అనవసరం
- గ్రామాల్లో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సుడిగాలి పర్యటన
- సిటిజన్ అవుట్‌రీచ్ ద్వారా అన్నదాతలకు భరోసా కల్పించిన కలెక్టర్

**విజయవాడ, సెప్టెంబర్ 8(జర్నలిస్ట్‌ఫైల్):**

రైతులకు ఇబ్బంది లేకుండా నిరంతర పర్యవేక్షణతో యూరియా, ఇతర ఎరువులను ప్రభుత్వం అందుబాటులో ఉంచుతోందని.. అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. సరైన అవగాహనతో ప్రభుత్వ సేవల సద్వినియోగంతో ముందడుగు వేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నదాతలకు భరోసా కల్పించారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా గ్రామగ్రామాన అగ్రికల్చర్ అవుట్‌రీచ్ (జన జాగృతి) కార్యక్రమం జరిగింది. రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన, సహకార, మార్క్‌ఫెడ్ తదితర శాఖల అధికారుల పర్యవేక్షణలో క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి ఎరువులపై అవగాహన కల్పించారు. మీకు తోడుగా మేమంతా ఉన్నాం.. అంటూ ఎరువుల వివరాలను తెలియజేస్తూ భరోసా కల్పించారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఉదయం నుంచే వివిధ గ్రామాల్లో పర్యటించారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి, ఇబ్రహీంపట్నం మండలం ఈలప్రోలు, కంచికచర్ల మండలం చెవిటి కల్లు, మైలవరం మండలం చంద్రగూడెం, నందిగామ మండలం ఐతవరం, పెనుగంచిప్రోలు మండలం కొనకంచి, జగ్గయ్యపేట మండలం బండిపాలెం.. ఇలా వివిధ గ్రామాల్లో పర్యటించి అన్నదాతలతో ముచ్చటిస్తూ యోగక్షేమాలను అడుగుతూ ఎరువుల పరంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఆయా ప్రాంతాల్లో ఎరువుల సరఫరా తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ అన్నదాతల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని, రైతు బాగుంటేనే గ్రామం, రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉంటుందని.. స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాకారానికి రైతు బాగోగులు, వ్యవసాయ రంగ అభివృద్ధి కీలకమని పేర్కొన్నారు. అవుట్‌రీచ్ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, ఉద్యాన తదితర శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సమీపంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం, అక్కడ అందుబాటులో ఉన్న ఎరువులు, వచ్చే వారంలో వచ్చే ఎరువుల వివరాలు తదితరాలకు సంబంధించిన సమాచారాన్ని వివరించడంతో పాటు పంట దశ ప్రకారం వినియోగించాల్సిన ఎరువుల మోతాదు, నానో యూరియా ప్రయోజనాలను కూడా వివరిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పటిష్ట ప్రణాళిక ప్రకారం సజావుగా యూరియా, ఇతర ఎరువుల సరఫరా జరుగుతోందని, అవసరానికి అనుగుణంగా ఎరువులు పంపిణీ చేస్తున్నా మని స్పష్టం చేశారు. రియల్ టైమ్ ఇన్ఫర్మేషన్‌తో ఎక్కడా ఇబ్బంది లేకుండా ప్రభుత్వం నిరంతరం పంపిణీ వ్యవస్థను పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.



## ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ దాడులు

**ఆగిరిపల్లి, సెప్టెంబర్ 8(జర్నలిస్ట్‌ఫైల్):**

ఆగిరిపల్లి మండలంలో పలు ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. నెక్కలం గొల్లగూడెంలోని హనుమాన్ ఏజెన్సీస్‌లో రు.2,75,550/- విలువ కలిగిన 12.650 టన్నుల ఎరువులు స్టాక్ రిజిస్టర్లో వ్యత్యాసము ఉండటాన్ని గుర్తించి వాటిని సీజ్ చేసి, షాపు యజమాని పై నిత్యావసరాల చట్టం 1955 ప్రకారం 6(ఎ) కేసులు నమోదు చేయడమైనది మరియు '%ఎ%' ఫారం లేనందున రు.1,17,810/- విలువ కలిగిన 3.850 టన్నుల ఎరువులు అమ్మకాలు నిలుపుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

## మాతాశిశు విభాగాలకు మరో వెయ్యి పడకలు

### మంత్రి సత్యకుమార్ యాదవ్



**అమరావతి, సెప్టెంబర్ 8(జర్నలిస్ట్‌ఫైల్):**

మాతాశిశు వైద్యం మరింత మెరుగ్గా అందించడానికి ఆయా విభాగాలకు రాష్ట్రంలో కొత్తగా వెయ్యి పడకలు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. కొత్తగా గుంటూరు, కాకినాడ జీజీహెచ్‌లలో రెండు నూతన ఎంసీహెచ్ (మదర్ అండ్ చైల్డ్ కేర్) బ్లాకుల్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఒక్కో దాంట్లో 500 చొప్పున పడకలు వస్తాయని ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఎంసీహెచ్ బ్లాకులకు అవసరమయ్యే వైద్య పరికరాల్ని రూ.51.3 కోట్లతో కొనుగోలుకు ఇప్పటికే ఆమోదం తెలిపామన్నారు. గుంటూరు జీజీహెచ్‌లో పూర్వ విద్యార్థుల ఆర్థిక సహకారంతో రూ.86 కోట్లు, కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాలలో రూ.46 కోట్లతో నిర్మాణంలో ఉన్న బ్లాకులు త్వరలో పూర్తి కానున్నాయని వివరించారు. ఫిజియోథెరపీతో పలు అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. సోమవారం ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా ఫిజియోథెరపిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆర్థరైటిస్, వెన్నుపూస సమస్యలు, కండరాల్ని బలోపేతం చేయడం తదితరాలకు ఫిజియోథెరపీ ప్రభావవంతంగా పనిచేస్తుందన్నారు.

# ఉల్లి రైతులకు కష్టాలు!

- కొనుగోలు విధానంలో మార్పులతో తిప్పలు
- కర్నూలు మార్కెట్ యార్డులో పేరుకుపోయిన నిల్వలు



**కర్నూలు, సెప్టెంబర్ 8(జర్నలిస్ట్‌ఫైల్):**

ఉల్లి రైతులు నష్టపోకుండా మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాలు రూ.1200 మద్దతు ధరతో కొనుగోలు చేయిస్తాం. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం ప్రకటించడంతో అన్నదాతలు సంతోషిం చారు. కానీ వారి ఆనందం కాసేపట్లోనే ఆవిరైంది. కర్నూలు మార్కెట్ యార్డులో మూడు రోజులు మాత్రమే మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లి కొనుగోలు చేశారు. ప్రస్తుతం వ్యాపారులు, మార్క్‌ఫెడ్ కలిసి కొనుగోలు చేసేలా కొత్త విధానాన్ని తెరపైకి తేవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం ప్రయోగాత్మకంగా అమలుచే యగా ఈ విధానం తొలిరోజే వికటించింది. సగానికి పైగా సరకును వ్యాపారులు కొనకపోవడంతో అన్నదా తలు ధర్నా చేశారు. నూతన విధానంలో రైతుల నుంచి తొలుత వ్యాపారులు నిర్ణీత ధరకు ఉల్లిని కొనుగోలు చేస్తారు. మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాలు రూ.1200కు కొనుగోలు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో.. వ్యాపారులు అంతకంటే తక్కువ ధరకు కొంటే.. మిగతా మొత్తాన్ని ప్రభుత్వం రైతులకు చెల్లిస్తుం ది. కానీ వ్యాపారులు సరకును ఎప్పుడు కొనుగోలు చేస్తారు? అసలు కొంటారా లేదా? అన్న విషయంపై స్పష్టత లేక కర్షకులు ఆందోళన చెందుతున్నారు. కొందరి సరకును మాత్రమే కొనుగోలు చేస్తున్నారని మిగతా రైతులు వాపోతున్నారు. మొత్తం సరకును నేరుగా మార్క్‌ఫెడ్ అధికారులే కొనుగోలు చేస్తే ఇబ్బంది ఉండదంటున్నారు. కొత్త విధానంతో తాము వ్యాపారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లిని కొనుగోలు చేస్తున్న వ్యాపారులు ఆ సరకు మార్కెట్ నుంచి బయటకు వెళ్లే వరకు రైతులే కాపలా ఉండాలంటూ షరతు విధిస్తున్నారు. దిగుబడులు విక్రయించిన తర్వాత కూడా వారు మార్కెట్‌లోనే ఉండాల్సి వస్తోంది. శనివారం మార్కెట్ యార్డుకు సుమారు 1659 టన్నుల సరకు వచ్చింది. ఇందులో 776 టన్నులే కొన్నారు. గత 4రోజులుగా మార్క్‌ఫెడ్ ద్వారా కొన్న సరకు, కొనుగోలు చేయనిది మొత్తం 27 వేల క్వింటాళ్లకు పైగా ప్రస్తుతం మార్కెట్ యార్డులోనే నిల్వ ఉంది.

### గతంలో రైతులను ముంచిన వైకాపా

కర్నూలు మార్కెట్ యార్డులో 2018-19 మధ్య కాలంలో వ్యాపారులు ఇచ్చే ధర ఆధారంగా రైతులు నష్టపోకుండా గిట్టుబాటు ధర లభించేలా అదనపు మొత్తాన్ని ప్రభుత్వం బోనస్‌గా చెల్లించింది. ఆ విధానాన్ని నాటి తెదేపా ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసింది. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఉల్లి రైతులకు చెల్లించాల్సిన బోనస్ సుమారు రూ.6.50 కోట్ల మొత్తాన్ని నిలిపేసింది. ఆ మొత్తాన్ని చెల్లించాలని ఐదేళ్ల పాటు అన్నదాతలు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో నాటి విధానాన్నే మళ్లీ అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఆదివారం మార్కెట్ యార్డును సందర్శించారు. క్వింటాలు ఉల్లికి రూ.1200 ధర వస్తుందని.. చెల్లింపుల విషయంలో ఆందోళన అవసరం లేదని రైతులకు ధైర్యం చెప్పారు.

### సగంలోనే నిలిచిన శీతల గిడ్డంగి

కర్నూలు మార్కెట్ యార్డుకు వచ్చిన రైతులు నష్టపోకుండా ఉల్లిని శాస్త్రీయ విధానాల్లో నిల్వచేసేందుకు గత తెదేపా ప్రభుత్వం కేంద్ర గ్రామీణాభివృద్ధి నిధులు (ఆర్డీఎఫ్) రూ.5 కోట్లతో భారీ శీతల గిడ్డంగి నిర్మాణం చేపట్టింది. సుమారు 50 శాతం పనులు పూర్తయ్యాయి. ఇది అందుబాటులోకి వస్తే 5 లక్షల టన్నుల ఉల్లిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత దాని నిర్మాణం నిలిచిపోయింది. ఆ పథకం సమయం ముగిసిపోవడంతో కేంద్రం నుంచి నిధులు రాని పరిస్థితి. కూటమి ప్రభుత్వం గిడ్డంగి నిర్మాణాన్ని పూర్తిచేయాలని నిర్ణయించింది

## సెల్ టవర్ ఎక్కి హల్ చేసిన యువకుడు



○ బుజ్జగించి కిందకు దింపి దేహశుద్ధి చేసిన స్థానికులు

**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** సెల్ టవర్ ఎక్కి హల్చల్ చేసిన వ్యక్తిని రెండు గంటల హైడ్రామా అనంతరం త్రీ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక పాండురంగ పేట 27వ వార్డు పరిధిలో, ఆ ప్రాంతంలో ఉంటున్న అశోక్ అనే వ్యక్తి, సమీపంలోని అంగన్ వాడీ స్కూలు భవనం పై ఉన్న, సెల్ టవర్ పైకి వెళ్ళి హల్చల్ సృష్టించాడు. విషయం తెలుసుకున్న త్రీ టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సెల్ టవర్ పైన ఉన్న వ్యక్తిని కిందికి దిగి రావాలని కోరారు. ఆ ప్రాంత మహిళలు, యువకులు, వార్డు కౌన్సిలర్ బోయపాటి అరుణ, ఆవ్యక్తిని కిందికి రావాలని అనేవిధాలుగా ప్రాదేయపడ్డారు. సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో సెల్ టవర్ ఎక్కిన అశోక్, తను ప్రేమించే అమ్మాయితో తనకు పెళ్లి చేయాలంటూ, లేదంటే దూకేస్తానంటు బెదిరించాడు. పోలీసులు అతని నచ్చజెప్పి ఆ అమ్మాయితో పెళ్లి చేస్తామని కిందికి దిగి రావాలని కోరారు. కింద ఉన్నవారు అశోక్ డిమాండ్, నెరవేరుస్తామని, నమ్మించే ప్రయత్నం చేసిన క్రమంలో,రెండు గంటల తర్వాత ఎట్టకేలకు,సదరు అశోక్ అనే వ్యక్తి సెల్ టవర్ దిగాడు. దీంతో ఆప్రాంత వాసులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. బొబ్బిలి ప్రాంతం నుండి, తెనాలి వలస వచ్చి గత ఎనిమిదేళ్లుగా భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్న అశోక్, ఇప్పటికే, మరో వివాహిత మహిళతొ, సహజీవనం చేస్తున్నాడు. ఓ మైనర్ బాలికను ప్రేమించానని పెళ్లి చేయాలని అశోక్ పెట్టిన డిమాండ్ పట్ల, ఆ ప్రాంతవాసులు ఆగ్రహావేశులై, అశోక్ కు,దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కాగ అశోక్ పీకలదాక మద్యం సేవించి, మత్తు తలకెక్కి, సెల్ టవర్ ఎక్కి తిక్క పని చేయడం పట్ల ఆ ప్రాంతవాసులు, అతనిని ఆ ప్రాంతంలో లేకుండా పంపించేయాలని,పోలీసు అధికారులను కోరుతున్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



○ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేసిన పోతినేని శ్రీనివాసరావు

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** రేషన్ పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను వినియోగంలోకి తీసుకువచ్చిందని గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు అన్నారు. సొమవరం మంగళగిరి పట్టణంలోని 27వ వార్డులో లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారి స్మార్ట్ రేషన్ కార్డు విధానాన్ని తీసుకురావడం జరిగిందని తెలిపారు. అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో చంద్రబాబు నాయుడు ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. ఈ స్మార్ట్ కార్డులతో రాష్ట్రంలో ఎక్కడైన రేషన్ సరుకులు తీసుకోవచ్చని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందచేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో 27 వ వార్డు అధ్యక్షులు పందేటి మణికంత, పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు వాసా పద్మ,పందేటి తిరుపతయ్య,రాయపాటి విజయ్ కుమార్,నక్క బాల కోటేశ్వరరావు,పఠాన్ రియాజ్ ఖాన్,గజ్జల వెంకటరమణ, కటకంకల్యాణ చక్రవర్తి, నందూరి పురుషోత్తం,చింత క్రింది వెంకటేశ్వరరావు, పాగోలు ప్రకాష్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## కొల్లి లక్ష్మయ్య చౌదరికి ఘన నివాళులు



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి సీకే కన్వెన్షన్ రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ కన్వీనర్, నవులూరు గ్రామ మాజీ సర్పంచ్ కొల్లి లక్ష్మయ్య చౌదరి సంస్మరణ కార్యక్రమం జరిగింది. తెలుగుదేశం పార్టీ తోపాటు, వివిధ పార్టీ నాయకులు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల ప్రముఖులు హాజరై కొల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, సిటీ కేబుల్ మేనేజింగ్ డైరెక్టర్ రావూరి రమేష్‌బాబు, టీడీపీ నాయకులు కొత్తపల్లి శ్రీనివాసరావు, అన్నే చంద్రశేఖర్, మన్నెం రమేష్ బాబు, అనిత, బెల్లంకొండ నరసింహారావు, పాతర్ల రమేష్, గోవాడ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం ఎరువుల కోట్ల ముందు... రైతుల పడిగాపులు




**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** పెద్ద మొత్తంలో కేంద్రం నుండి రాష్ట్రానికి యూరియా తరలి రానుందని అధికారులు ప్రజా ప్రతినిధులు చెబుతున్నా, యూరియా కొరత మాత్రం రైతులను వెంటాడుతుంది. ఖరీఫ్ వరి సాగులో రైతుకు అవసరమైన రసాయన ఎరువలలో కీలకమైన యూరియా కోసం రైతులు పట్టణములోని ఎరువుల కోట్ల బజార్లు పడిగాపులు పడుతున్నారు. సోమవారం సాయంత్రం మణికంత ఫర్టిలైజర్స్ షాపుకు యూరియా వచ్చిందని తెలియడంతో, ఆ షాపు ముందు రైతులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ఉత్కంఠ పరిస్థితి చోటుచేసుకుంది. తెనాలి పరిసర గ్రామాల పలువురు రైతులు యూరియా కొరత కారణంగా తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను మీడియాకు వివరించారు. త్వరితగతిన బహిరంగ మార్కెట్లో యూరియా కొరత లేకుండా చూడాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## పారిశుధ్య కార్మికులకు ప్రమాదభీమా సౌలభ్యం ఓ బాధ్యత : మంత్రి నాదెండ్ల



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** పారిశుధ్య కార్మికుల ఆరోగ్యంపట్ల శ్రద్ధవహించాలని, విధి నిర్వహణలో విధిగా వారి ప్రయోజన కోసం ఇచ్చిన రక్షణ వస్తువులను ఉపయోగించుకోవాలని , పట్టణానికి మంచి పేరు తీసుకురావడంలో పారిశుధ్య కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. స్థానిక కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రం వేదికగా సోమవారం పారిశుధ్య కార్మికులకు, మంత్రి నాదెండ్ల మనోహర్ సొంత నిధులతో, ప్రమాద బీమా బాండ్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల, కుటుంబాల ప్రయోజనం కోసం, ప్రమాద బీమా పాలసి ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్రంలోని తెల్ల రేషన్ కార్డుదారులకు, 25 లక్షల రూపాయల ఆరోగ్య భీమా పాలసీని అమలు చేయనున్నట్లు తెలిపారు. పారిశుధ్య కార్మికులుఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించరాదని, ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా, మార్పును స్వాగతించాలని కోరారు. మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న పారిశుధ్య కార్మికుల ప్రయోజనాలకు, తగు ప్రాధాన్యం కల్పించడం పట్ల మంత్రివర్యులకు ధన్యవాదాలు తెలిపారు. తహసిల్దార్ కె వి గోపాలకృష్ణ మాట్లాడుతూ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ పారిశుధ్య కార్మికులకు ప్రమాద భీమా సౌలభ్యం కల్పించడం ద్వారా మానవత్వాన్ని చాటుకున్నారని, పారిశుధ్య కార్మికులు ఎప్పుడు ఆరోగ్యంగా ఉండడం ద్వారా పట్టణ ప్రజలకు ప్రయోజనకరమన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు, 5లక్షల, విలువైన ప్రమాద భీమా బాండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి కమిషనర్ శ్రీకాంత్, ఎంహెచ్ఓ ఏసుబాబు, తదితర పురపాలక సంఘ సిబ్బంది, పారిశుధ్యకార్మికులు, పారిశుధ్య విభాగం యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## లిక్కర్ డాన్ల పర్యవేక్షణలో వైసీపీ : ఎమ్మెల్యే నసీర్

○ గత ఐదేళ్లలో అన్నీ స్కాములే

○ అరాచకం, అవినీతి రాజ్యమేలాయి

○ వైసీపీపై నిప్పులు చెరిగిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

○ నియోజకవర్గంలో రూ.1.47 కోట్ల పనులకు శంకుస్థాపనలు



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రస్తుతం లిక్కర్ డాన్ల పర్యవేక్షణలో వైసీపీ పని చేస్తోందని, గత ఐదేళ్ల పాలనంతా అవినీతి మాఫియా నడిచిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ విమర్శించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో రూ. 1.47 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్థానిక రాఘవనగర్ 1వ లైను, ఆర్టీసీ కాలనీ వద్ద రూ. 27.48 లక్షలు, రాఘవనగర్ లో రూ. 32.16 లక్షలు, రైలు పేట రూ. 19.04 లక్షలు, అంజుమన్ స్కూల్ వెనుక వైపు రూ. 29.27 లక్షలు, లాంచెస్టర్ రోడ్లు రూ. 40 లక్షలతో సీసీ డ్రెయిన్లు, సీసీ రోడ్లు, పైపు లైన్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేపట్టారు.

వీటికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అరాచకం, అవినీతి మినహా రాష్ట్రానికి ఏమీ మిగల్లేదని చెప్పారు. ప్రస్తుతం కూడా లిక్కర్ స్కామ్ ముఠానే ఆ పార్టీలో ఉన్నారని విమర్శించారు. పీపీపీ పద్ధతిలో చేపట్టిన మెడికల్ కాలేజీల నిర్మాణానికి వైసీపీ దుష్ప్రచారం చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు.

తాము ఎన్నికల సమయంలో అన్ని ప్రాంతంలో పర్యటించామని, అప్పుడు కనీసం రోడ్లు కూడా లేని పరిస్థితి నెలకొందని తెలిపారు. ఇప్పుడు ఈ ప్రాంతాల్లో ప్రతి రోడ్డునూ సుందరంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. కేవలం రోడ్లు మాత్రమే కాదని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు పీ-4 వంటి గొప్ప కార్యక్రమాన్ని చేపట్టామని వెల్లడించారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాల అమలు ద్వారా ప్రజలకు సంతోషంగా ఉన్నారని తెలిపారు.

తాజాగా స్మార్ట్ రేషన్ కార్డులు అందించిన నిత్యావసరాల సరుకుల సరఫరాలో పారదర్శకతకు పెద్ద పీట వేస్తున్నామని చెప్పారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం విడిచి వెళ్లిపోయిన పరిశ్రమలను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషితో తిరిగి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటికే వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని వెల్లడించారు. తాజాగా స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా మహిళల ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీలా, క్లస్టర్ ఇంచార్జ్ అన్వర్, కోటా పిచ్చిరెడ్డి, మొవ్వ శైలజ, జబీ, బెళ్ళ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ బాషి, మేకల రవీంద్రబాబు, నజీర్, బాబు, షరీఫ్, సుభాని, దాసరి శ్రీనివాస్, రాకేష్, రత్తయ్య, మహంకాళి శ్రీనివాస్, దాసు బండ్లమూడి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు నగర అభివృద్ధికి రోటరీ క్లబ్ భాగస్వామ్యం

○ ప్రజల అవగాహనతోనే ప్రతి కార్యక్రమం విజయవంతం అవుతుంది - నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్) :** "మన గుంటూరు నగరం" కార్యక్రమానికి హాజరైన రోటరీ క్లబ్ ప్రతినిధులను అభినందిస్తూ నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, యన్.జి.ఓలు, రోటరీ క్లబ్ భాగస్వామ్యం వలననే ప్రతి అభివృద్ధి కార్యక్రమం విజయవంతం అవుతుందని తెలిపారు. సోమవారం నగర పాలక సంస్థ పరిధిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి, ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించడానికి రోటరీ క్లబ్ ప్రతినిధులతో కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ వివరించారు, జాతీయ స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షన్‌లో టాప్ 23 సిటీస్‌లో గుంటూరు నగరం నిలిచినందుకు సిబ్బంది, పారిశుధ్య కార్మికుల కృషి కీలకం. నగరంలో తడి, పొడి చెత్తలను వేరు చేయడం, హెూం కంపోస్ట్, రూఫ్ గార్డెన్ వంటి అవగాహన కార్యక్రమాలను ప్రజలకు కల్పించడం, విన్డ్, క్లస్టర్, వర్మి కంపోస్ట్ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు.

ఈ సందర్భంగా కమిషనర్ తెలిపారు, ఈ సంవత్సరం దశల వారీగా 5 లక్షల మొక్కలు నాటే లక్ష్యంతో ప్రజా సంఘాలు, యన్.జి.ఓలు, విద్యార్థులు, ప్రజలను భాగస్వాములుగా చేస్తామని. వారిని భాగస్వాములుగా చేయడం ద్వారా మొక్కలను నాటి వాటి సంరక్షణ సులభం అవుతుంది. ప్రజల అవసరాలను తెలుసుకుని మొక్కల పంపిణీ, సంరక్షణకు ట్రీ గార్డ్స్ ఏర్పాటు చేయాల్సిందని సూచించారు. సమావేశంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు బాల సుబ్రహ్మణ్యం, కృష్ణమూర్తి, ఆర్. పద్మజ, అనురాధ, వీర రాఘవరావు, కొండపనేని విజయకృష్ణ, రిష్విక, సీతారమేష్, డిప్యూటి కమిషనర్లు డి. శ్రీనివాసరావు, సి. హెచ్. శ్రీనివాసరావు, టి. వెంకటకృష్ణయ్య, ఇంచార్జ్ యస్.ఈ సుందరామి రెడ్డి, నగర పాలక సంస్థ విభాగాధిపతులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి - ఎస్పీ సతీష్ కుమార్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం "ప్రజా ఫిర్యాదులు – పరిష్కార వేదిక" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పాల్గొని, జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల వినతులను స్వయంగా స్వీకరించారు. వివిధ సమస్యలపై అర్జీలు అందుకున్న ఎస్పీ వాటిని జాగ్రత్తగా పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎస్పీ ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత పోలీస్ అధికారులకు వెంటనే పంపించారు. వారితో ఫోన్‌లో ప్రత్యక్షంగా మాట్లాడి, చట్టపరమైన పరిమితులలో నిర్ణీత గడువులోపు పరిష్కారం చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు న్యాయం జరగడానికి అధికారులు కఠినంగా చర్యలు తీసుకోవాల్సిందేనని హెచ్చరించారు.

ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పోలీసులు అందుబాటులో ఉంటారని ఎస్పీ స్పష్టం చేశారు. పోలీస్ శాఖ పరిధిలో ఉన్న ప్రతి ఫిర్యాదును ప్రజలు స్వేచ్ఛగా తెలియజేయాలని ఆయన పిలుపునిచ్చారు. అందిన ప్రతి వినతిని నిర్ణీత గడువులోపు చట్టబద్ధంగా పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలు, భూ వివాదాలు, ఇతర సామాజిక సమస్యలపై ప్రజలు తమ సమస్యలను వినిపించారు. వాటిని తక్షణమే సంబంధిత అధికారుల దృష్టికి చేర్చిన ఎస్పీ, త్వరిత పరిష్కారం కోసం చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) జి.వి. రమణమూర్తి, ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, సీసీఎస్ డీఎస్పీ శివాజీ రాజు, సౌత్ డీఎస్పీ భానోదయతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్‌వోసీ చెక్కు అందజేత



○ మంత్రి నారా లోకేష్ చొరవతో మంజూరైన

○ మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబ సభ్యులు

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి పట్టణంలోని కొత్తపేటకు చెందిన షేక్ సలీమా కుమార్తె జోయా ఆశ్రత్ (3సం) అనారోగ్యానికి గురికాగా విజయవాడలోని ఆంధ్రా ఆస్పటల్‌లో చికిత్స చేయిస్తున్నారు. సలీమా కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో మంత్రి నారా లోకేష్‌కు అర్జీ పెట్టుకోగా వెంటనే స్పందించిన ఆయన సీఎంఆర్ఎఫ్ అధికారులతో మాట్లాడి రూ. 2 లక్షల 50 వేల ఎల్‌వోసీని మంజూరు చేయించారు. ఆ ఎల్‌వోసీ పత్రాన్ని టీడీపీ నాయకులు సోమవారం జోయా ఆశ్రత్ తల్లికి అందజేశారు. దీనితో మంత్రి నారా లోకేష్‌కు జోయా ఆశ్రత్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, 1వ వార్డు అధ్యక్షులు శ్రీనివాసరావు, కె రమేష్ బాబు, పోలూరి నాగేశ్వరరావు, ఎం రామకోటేశ్వరరావు, షేక్ సలీమ్ బాష, బాణాల రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పాల ఉత్పత్తి దారులకు బోనస్ పంపిణీ



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** సంగం డైరీ పాల ఉత్పత్తిదారులు పశుపోషణలొ మరింత మెలకువలు పాటించడం ద్వారా పాడి పరిశ్రమను పెంపొందించు కోవచ్చని సంఘం డైరీ మేనేజర్ బండ్లమూడి శ్రీకాంత్ పేర్కొన్నారు. మండలంలోని గుడివాడ గ్రామంలోని పెదరావూరు పాల సొసైటీ పాల ఉత్పత్తిదారులు, 99 మందికి, 1,69,000 బోనస్ గా పంపిణీ చేశారు. అదేవిధంగా పెదరావూరు పాలసొసైటి ప్రాంగణంలొ, 212మంది పాల ఉత్పత్తి దారులకు, 3 లక్షల,49వేలు, బోనస్ పంపిణీ చేశారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమాలలో ముఖ్య అతిథులుగా, సంఘం డైరీ మేనేజర్ బండ్లమూడి శ్రీకాంత్, చీఫ్ ఆపరేటింగ్ అధికారి పర్వతనేని అనీల్ కుమార్,లు, పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకునేందుకు మెలుకువలు వివరించారు. పాల ఉత్పత్తిదారుల సంక్షేమం కోసం సంఘం డైరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. సీనియర్ తెలుగుదేశం నాయకులు కావూరి చంద్రమోహన్, గుడివాడ గ్రామ సర్పంచ్ ఎడ్లపాటి రాకేష్, పెదరావూరు కార్యక్రమంలొ డైరీ పాలక వర్గ సభ్యులు శాఖమూరి వెంకటేశ్వరరావు, పాలడుగు వెంకట కృష్ణారావు, ఆలూరి అంజయ్య, మాదల సాంబశివరావు, కొడాలి సుధాకర్,పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

## జనసేన కుటుంబానికి 5 లక్షలు ఆర్థిక సహాయం



○ ఆర్థిక సహాయం చేసిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్)** బ్రహ్మంగారిమఠంలోని టీజీపీ రోడ్ కొత్త బసాపురం లో ఉన్న కొక్కు శ్రీకాంత్ కుటుంబానికి జన సేన పార్టీ తరఫున ఐదు లక్షల రూపాయలను ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు మైదుకూరు నియోజకవర్గం జనసేన ఇంచార్జ్ పందింటి మల్హోత్రా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొక్కు శ్రీకాంత్ జనసేన కార్యకర్తగా పార్టీ సభ్యత్వం చేసుకున్నాడు. కొద్ది నెలల కింద రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం వల్ల పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేసి ఐదు లక్షల రూపాయలను వారి కుటుంబానికి ఆర్థిక సహాయం మంజూరు చేశారని ఆయన అన్నారు. సోమవారం కొక్కు శ్రీకాంత్ అమ్మ కొక్కు మల్లీశ్వరి ఆమె నివాసంలో ఆమెతో మాట్లాడి పార్టీ మీకు ఎప్పుడు అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా 5 లక్షల చెక్కును ఆమెకు అందజేశారు. అనంతరం కొక్కు శ్రీకాంత్ అమ్మ కొక్కు మల్లేశ్వరి మాట్లాడుతూ మా కుటుంబానికి జనసేన పార్టీ తరఫున ఆర్థిక సహాయం అందించిన కొణిదెల పవన్ కళ్యాణ్ కు రుణం తీర్చుకోలేనిది పార్టీకి ఎప్పుడు మా కుటుంబం మద్దతు ఉంటుందని మా సహాయం రావడానికి చేసిన మైదుకూరు నియోజకవర్గ ఇన్చార్జ్ పందింటి మల్హోత్రా, కొక్కు రవి రాయల్ ధన్యవాదములు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధరిమి శెట్టి మురళి, జె.నాగరాజు, అంకాని వెంకటేశ్వర్లు జనసేన వార్డు మెంబర్ రాజేష్, అంబిశెట్టి వెంకటసుబ్బయ్య, పసుపులేటి వెంకటసుబ్బయ్య, రవి దిరసవంచ మల్లేపల్లి వెంకటేష్,కటారు శివ, ఆకుల శివ, మంగళగిరి ఆఫీసు నుంచి సభ్యులు, తదితరులు ఉన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# సృష్టి అక్రమాల కేసు లో ముగ్గురు ప్రభుత్వ వైద్యుల సస్పెన్షన్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా నడుస్తూ సంతాన సాఫల్య సేవల్లో అక్రమాలకు సంబంధించిన 'సృష్టి' కేసులో ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రులకు చెందిన ముగ్గురు వైద్యులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది.

ఈ వ్యవహారంలో ఆంధ్ర మెడికల్ కాలేజి, విశాఖపట్నం లో ఏనస్థిషియా విభాగాధిపతి డా. వాసుపల్లి రవి, గైనకాలజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ డా.పి. ఉషాదేవి మరియు శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాలలో పిడియాట్రిక్స్ విభాగంలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఎ. విద్యుల్లతలపై గత నెలలో ఆరోపణలు వచ్చాయి. వీరు ముగ్గురిపై హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. సరోగసి చట్టం మరియు జువినైల్ జస్టిస్ చట్టం లోని పలు సెక్షన్ల క్రింద వీరిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు గత నెల 28న హైదరాబాద్ పోలీసులు అధికారికంగా తెలిపారు.

ఈ నేపథ్యంలో... ఈ ముగ్గురు వైద్యుల పై నమోదైన ఆరోపణల తీవ్రత దృష్ట్యా వారిని పోలీసులు అరెస్ట్ చేసిన తేది నుంచి సస్పెండ్ చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలిచ్చారు. వీరిని విధుల్లో కొనసాగిస్తే వ్యవస్థ పట్ల ప్రజా విశ్వాసం సన్నగిల్లుతుందని, కేసుల విచారణకు ఆటంకం కలిగించే అవకాశమున్నందున వారిని సస్పెండ్ చేయాలని మంత్రి ఆదేశించారు.

ఈ ముగ్గురు వైద్యులు 'సృష్టి ' అక్రమాల కేసులో అరెస్ట్ అయినట్లు గత నెల 9న వార్తలొచ్చాయని, వారిపై చర్యలు తీసుకొనటానికి ఆలస్యం ఎందుకయిందని మంత్రి వాకబు చేశారు. పేపరు వార్తల నేపథ్యంలో లో వెంటనే నిర్ధారణ కోసం సంప్రదించగా, గత నెల 28న అరెస్ట్ తేదీలు, నిందితులు జ్యూడిషియల్ కస్టడీ లో ఉన్న వ్యవధి వివరాలను హైదరాబాద్ పోలీసులు తెలిపారని అధికారులు వివరించారు.

'సృష్టి ' అక్రమాలు మీడియా లో వచ్చిన కొద్దిరోజులు ముందు నుంచి ఆ ముగ్గురు వైద్యులు విధుల్లో లేరని, తదనంతరం వారిని సంప్రదించడానికి ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్ళు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని మంత్రికి అధికారులు వివరించారు.

# అన్నదాతలపై వైసీపీ మొసలి



- యూరియా సరఫరా ఉన్నా రైతుల్లో భయాందోళనలు సృష్టిస్తూ వైసీపీ దుష్ప్రచారం
- మంత్రి కొలుసు పార్థసారథి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో రైతుల సమస్యలను రాజకీయ మాయాజాలంగా మార్చే వైసీపీ ప్రయత్నాలను గృహ నిర్మాణ, ఐ అండ్ పీఆర్ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సోమవారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో తీవ్రంగా ఖండించారు. రైతుల సమస్యలపై భయాందోళనలు సృష్టించడం, యూరియా కొరత ఉందని భ్రమను సృష్టించడం వంటి విధానాలు సాగుతున్నాయని మంత్రి తెలిపారు.

**కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు:** కూటమి ప్రభుత్వం 15 నెలల్లో సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేసి రైతులకు మేలు చేసినట్టు మంత్రి పేర్కొన్నారు. మామిడి, పొగాకు, కోకో, ఉల్లికి గిట్టుబాటు ధరలు, యూరియా సరఫరా, సాగునీరు, సాగునీటి ప్రాజెక్టులు, సాగునీటి విస్తీర్ణం పెంపు వంటి చర్యలు ఇప్పటికే పూర్తయినట్లు తెలిపారు. జగన్ పాలనలో 5 ఏళ్లలో ఏదీ చేయకపోవడం, రైతుల భరోసా కోల్పోవడం, ధాన్యం సొమ్ము మేము చెల్లించకపోవడం వంటి నెగటివ్ రికార్డులతో పోల్చి కూటమి ప్రభుత్వ ప్రదర్శనను హైలైట్ చేశారు.

**యూరియా సరఫరా - భరోసా:** జగన్ హయాంలో 5 లక్షల టన్నుల యూరియా మాత్రమే తీసుకురావడం, సరఫరా లేమితో రైతులను ఇబ్బందికి గురిచేయడం జరిగిందని, కూటమి ప్రభుత్వం 7 లక్షల టన్నుల యూరియాను అందుబాటులో ఉంచి రైతులకు భరోసా కల్పించిందని మంత్రి తెలిపారు. ధాన్యం కొనుగోలు, రైతుల ఖాతాల్లో చెల్లింపు, సాగునీటి విస్తీర్ణం పెంపు, సబ్సిడీ వ్యవసాయ పరికరాల పంపిణీ వంటి చర్యలన్నీ రైతుల ప్రయోజనానికి జరుగుతున్నాయని స్పష్టం చేశారు.

**వైసీపీకి సవాల్:** వైసీపీ దమ్ముంటే రైతు సమస్యలపై చర్చకు రావాలని, ఎవరినైనా భయాందోళనలకు గురిచేయకూడదని మంత్రి పార్థసారథి సూచించారు. ప్రజల మద్దతు పొందే కౌశలాన్ని చూపే మార్గం సమస్యల పరిష్కారంలో నేరుగా పాలనలో పాల్గొనడమే అని కూడా హైలైట్ చేశారు.

# శ్రీశైలం పంచమఠాలలో విశేష పూజలు



**శ్రీశైలం(జర్నలిస్ట్ ఫైల్):** శ్రీశైల దేవస్థాన పరిధిలోని పంచమఠాలలో సోమవారం ఉదయం లోకకల్యాణార్థం విశేష పూజాదికాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ముందుగా ఘంటామఠంలో, అనంతరం వరుసగా భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠాలలో అభిషేకాలు, పుష్పార్చనలు సంప్రదాయబద్ధంగా జరిగాయి.

ఈ సందర్భంగా అర్చకస్వాములు ముందుగా లోకకల్యాణ సంకల్పాన్ని పఠించారు. దేశం శాంతి సౌభాగ్యాలతో కళకళలాడాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగిన వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు కలగాలని, అకాల మరణాలు, అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు వంటి విపత్తులు జరగకుండా ఉండాలని ప్రార్థించారు. అనంతరం ఘంటామఠంలోని గణపతికి పూజలు జరిపి, ఇతర మఠాలలో అభిషేకాది అర్చనలు నిర్వహించారు.

శ్రీశైల క్షేత్ర సంస్కృతిలో మఠాలు శతాబ్దాలుగా కీలకపాత్ర పోషిస్తున్నాయి. 7వ శతాబ్దం నుంచే నిర్మితమైన ఈ మఠాలు గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం లాంటి ఆలయ నిర్మాణశైలితో ఆకట్టుకుంటాయి. కాలగర్భంలో కొన్ని మఠాలు కలిసిపోయినా, ప్రస్తుతం ఆలయానికి వాయువ్య భాగంలో ఉన్న ఘంటామఠం, భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠం పంచమఠాలుగా ప్రసిద్ధి చెందాయి.

శిథిలావస్థలో ఉన్న ఘంటామఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠాలను దేవస్థానం పునరుద్ధరించగా, భీమశంకరమఠానికి మరమ్మతులు చేపట్టింది. ఈ మఠాలలోని దేవతామూర్తులకు నిత్యధూపదీప, నివేదన కైంకర్యాలు నిరంతరాయంగా జరుగుతున్నాయి.

# రాష్ట్రంలో రైతులకు సరిపడిన యూరియా అందుబాటులో ఉంది

- రైతులు అందోళన చెందొద్దు శ్రీకాకుళం రూరల్ మండలం తండేవలసలో రైతులకు ఎరువులు పంపిణీ చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- గత ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను విస్మరించింది
- కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలించామనే వార్త పూర్తిగా అవాస్తవం
- ప్రతీ రైతు కావలిసిన ఎరువులును మూడు విడతల్లో తీసుకోవచ్చును రాష్ట్రంలో 83 వేల మెట్రిక్ టన్నులు యూరియా అందుబాటులో ఉంది
- కేంద్ర ప్రభుత్వం రబీకి 9.50 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించింది
- జిల్లాలో ఎరువుల నిల్వలు పుష్కాలంగా ఉన్నాయి



**శ్రీకాకుళం(జర్నలిస్ట్ ఫైల్):** రైతుకు ప్రస్తుతం సరిపడ యూరియా అందుబాటులో ఉందని రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం తండేవలస గ్రామంలో సోమవారం రైతు సేవాకేంద్రాన్ని మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఆనంతరం రైతులను ఉద్దేశించి మంత్ర మాట్లాడుడూ రాష్ట్రంలో ఎక్కడా యూరియా కొరత లేదనిఅని అన్ని జిల్లాల్లో సరిపడ యూరియా నిల్వలు ఉన్నాయని జిల్లాలో 23 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని అన్నారు. త్వరలో మరో 3 వేల మెట్రిక్ టన్నులు రానున్నాయని తెలిపారు. రాబోయే రబీ సీజన్‌కు కూడా రాష్ట్రానికి 9.50 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను కేటాయించడానికి కేంద్రం అంగీకరించిందని, కాబట్టి రబీ కోసం ఇప్పుడే ఎరువులు నిల్వ చేసుకోవాల్సిన అవసరం లేదని రైతులకు సూచించారు. రైతులు ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. యూరియా అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివిధ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సహా సోషల్ మీడియాలో వచ్చే వ్యతిరేక వార్తలు,కథనాలు అవాస్తవమని అన్నారు. అంతేగాక అన్ని రైతు సేవా కేంద్రాలు,పిఏసిఎస్లు తదితర చోట్ల రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రతి ఒక్కరికి అవసరమైనంత యూరియా మూడు విడతల్లో అందేలా అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. రైతుల ప్రయోజనమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. యూరియా సరఫరాలో అక్రమాలకు అవకాశం లేకుండా పారదర్శకంగా రైతులకు ఎరువులు పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లాకు మరో రెండు రోజుల్లో 3 వేల మెట్రిక్ టన్నుల యూరియా రానుందని అన్నారు. ఎరువుల సమాచారాన్ని తెలుసుకునేందుకు అన్ని జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబరు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఏడాది అంతటికి ఒకేసారి నిల్వ చేసుకోవాలనే ఆలోచన తోనే ఈ సమస్య తలెత్తుందని అన్నారు. ఎకరాకు 25 కేజీల యూరియా వాడాలి. దీనితో కూడా అదే దిగుబడి వస్తుందని ఎన్ని ఎకరాలు ఉంటే అన్ని 25 కేజీలు చొప్పున మూడు విడుదలకు అందించడం జరుగుతుందని అన్నారు. వ్యవసాయ శాస్త్రజ్ఞుల సూచనలతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నాయని గుర్తుచేశారు. దేశంలో దీనికి సంబంధించిన సర్వేలు నిర్వహించి ఇటువంటి ఆలోచనలు చేశాయని అన్నారు. గతం కంటే ఈ ఏడాది 70%మార్కఫెడ్ కు, 30%ప్రైవేట్ దుకానాలకు కేటాయించింది దేశంలో ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని అన్నారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. ఇప్పటికే డ్రోన్‌ల్లు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఎవరైనా ప్రైవేట్ డీలర్లు ఎరువులతో పాటు ఇతర వస్తువులను బలవంతంగా అమ్మడానికి ప్రయత్నిస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని రైతులకు మంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీకాకుళం శాసన సభ్యులు గొండు శంకర్,ఆర్డీవో సాయి ప్రత్యూష, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరిప్రసాద్, జిల్లా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాధ స్వామి, తహసీల్దార్ గణపతి, ఎంపీడీవో శైలజ, మాజీ ఎంపీపీ గొండు జగన్నాథరావు, సర్పంచ్ కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

**గత ప్రభుత్వం రైతు ప్రయోజనాలను విస్మరించింది :** గత ప్రభుత్వం రైతు ప్రయోజనాలను విస్మరించిందని తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. గతంలో ఉల్లి,మామిడి ధర తగ్గిన పట్టించుకొలేదని అన్నారు. కిలో రూ.2 వరకు పడిపోయనా పట్టించు కోలేదని అన్నారు. నేడు నీతి వాక్యాలు మాట్లాడుతున్నారని అన్నారు. ఎరువులు దొరకడం లేదని అసత్య ప్రచారం చేస్తున్నారని మండి పడ్డారు. తగ ప్రభుత్వం రైతులకు ఆదుకునే ప్రయత్నం కూడా చేయలేదని ఆరోపించారు. రైతులకు కోసం ఒక్క యాంత్రీకరణ పరికారాలు కూడా పంపిణీ చేయలేదని, రైతుల కోసం ఒక్క రూపాయాకూడా కర్చు పెట్టలేదని విమర్శించారు. రాష్ట్రంలో వర్షాబావం కారణంగా ఉల్లి పంట అనుకున్న సమయం కంటే ముందే తీయడంతో కొంత ఇబ్బంది వచ్చిందని, రైతుల ప్రయోజనం దృష్టిలో ఉంచుకుని కిలో రూ. 12 ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నామని అన్నారు. రైతులకు నష్టం జరగకుండా ఉంటేందుకు రైతల నుంచి ప్రభుత్వమే కొనుగోలు

# తిరుమల తిరుపతి దేవస్థానం ఇఓగా అనిల్‌కుమార్ సింఘాల్

- రాష్ట్రంలో పలువురు ఐఏఏస్ ల బదిలీ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** తిరుమల తిరుపతి దేవస్థానం ఇఓగా అనిల్‌కుమార్ సింఘాల్‌ను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఇఓగా ఉన్న శ్యామలరావును బదిలీ చేసింది. సింఘాల్ గతంలోనూ టీటీడీ ఈఓగా పనిచేశారు. గత కొంతకాలంగా పోస్టింగ్ కోసం ఎదురు చూస్తోన్న సింఘాల్‌ను ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన టీటీడీ ఇఓగా మరోసారి నియమించింది. కేంద్రంలోని బిజెపి పెద్దల ఆశీస్సులతో ఆయనకు ఈ పోస్టు దక్కినట్లు ఐఏఎస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కేంద్ర హోంమంత్రి సిఫార్సుతోనే ఆయనకు ప్రాధాన్యత కలిగిన పోస్టు ఇచ్చారనే ప్రచారం ఉంది. కాగా ప్రస్తుతం ఇఓగా ఉన్న శ్యామలరావును జీఏడి ముఖ్యకార్యదర్శిగా నియమించారు. గత కొన్నాళు ‌_గా ఆయనను బదిలీ చేస్తారనే ప్రచారం ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత శ్యామలరావును టీటీడీ ఇఓగా నియమించారు. అయితే ఈయన కాలంలోనే కల్తీ నెయ్యి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తరువాత తిరుపతిలో జరిగిన తొక్కిసలాట కూడా ఈయన హయాంలోనే జరిగింది. అప్పట్లో టీటీడీ ఈఓ, టీటీడీ ఛైర్మన్ నాయుడు బహిరంగంగానే పలు విమర్శలు చేసుకుని సంచలనం సృష్టించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వారిద్దరి మధ్య సయోధ్య కుదిర్చారనే వార్తలు వచ్చాయి. అయితే ఐఏఎస్‌ల బదిలీలు ఎప్పుడు జరిగినా శ్యామలరావు బదిలీ ఖాయమనే ప్రచారం ఉంది. దీన్ని నిజం చేస్తూ సోమవారం ఆయనను బదిలీ చేశారు. అయితే..ఆయనకు అత్యంత ప్రాధాన్యత కలిగిన జీఏడీ (పొలిటికల్) ప్రధాన కార్యదర్శి పోస్టులో నియమించారు. కాగా వైద్య,ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న కృష్ణబాబును రోడ్లు,భవనాలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. గత కొన్నాళ్లుగా ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు కృష్ణబాబుకు మధ్య విబేధాలు ఉన్నాయని, ఆయనను మార్చాలని సత్యకుమార్ ముఖ్యమంత్రిని కోరుతున్నారనే ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో కృష్ణబాబును బదిలీ చేశారు. కాగా జిఏడి పొలిటికల్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ముఖేష్‌కుమార్ మీనాను ఎక్సైజ్ శాఖ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. జిఏడీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ముఖేష్‌కుమార్ మీనా ఇటీవల ఉద్యోగుల రిజర్వేషన్ల విషయంలో వ్యవహరించిన తీరుతో ఆయనను బదిలీ చేశారంటున్నారు. పౌరసరఫరాలశాఖ కమీషనర్‌గా ఉన్న సౌరభ్‌గౌర్‌ను వైద్యశాఖ కార్యదర్శిగా నియమించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న జి.అనంతరామును గవర్నర్ కార్యదర్శిగా ప్రభుత్వ నియమించింది. ఇప్పటి వరకూ గవర్నర్ కార్యదర్శిగా ఉన్న హరిజవహర్‌లాల్‌ను దేవా దాయశాఖ కార్యదర్శిగానూ, మైనార్టీశాఖ కమీషనర్‌గా ఉన్న సిహెచ్ శ్రీధర్‌ను మైనార్టీశాఖ కార్యదర్శిగా నియమించారు. పరిశ్రమలశాఖ కార్యదర్శిగా ఉన్న ప్రవీణ్ కుమార్‌ను ఢిల్లీలోని ఎపి భవన్ రెసిడెంట్ కమీషనర్‌గానూ, లేబర్ కమీషనర్‌గాఉన్న వి.శేషగిరిబాబును లేబర్ శాఖ కార్యదర్శిగానూ, రోడ్లు,భవనాలశాఖ కార్యదర్శిగా ఉన్న కాంతిలాల్ దండేను ఇఎఫ్ఎస్&టి కార్యదర్శిగా నియమించారు.

# గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగుల ఆందోళనలకు అల్టిమేటం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. 1.25 లక్షల మంది సచివాలయ సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే రాష్ట్ర సంచాలకులకు ముందస్తు సమాచారం సమర్పించారు. 15 రోజుల్లోగా పరిష్కారం చూపకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామని ఆంధ్రప్రదేశ్ గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక స్పష్టం చేసింది.

**ప్రభుత్వ ఆశయాలకు కట్టుబడి ఉన్నామన్న ఉద్యోగులు :** ముఖ్యమంత్రి విజన్-2047 సాధనలో శక్తివంచన లేకుండా కృషి చేయడానికి తాము సిద్ధమని ఉద్యోగులు వెల్లడించారు. అయితే, తరచూ ఇంటింటికీ తిరిగి సర్వేలు నిర్వహించడం వలన అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తోందని, ఇది ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఉద్యోగుల డిమాండ్లు :** ఇంటింటికీ తిరిగి సర్వేలు, ఇతర పనుల నుండి విముక్తి కల్పించాలని, సచివాలయ ఉద్యోగులను మాతృశాఖలకు అప్పగించాలని, అదనపు వత్తిడి విధులు (ఆదివారాలు, పండుగలు, సెలవులు కూడా వీడియో కాన్ఫరెన్స్‌లు, బలవంతపు పనులు) ఆపాలని కోరారు. అంతేకాకుండా నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, ఆరు సంవత్సరాలు సేవ చేసిన వారికి AAS ప్రకారం స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని, రికార్డు అసిస్టెంట్ క్యాడర్‌ను జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌గా మార్పు చేయాలని, విభాగాల వారీగా ప్రమోషన్ ఛానల్స్ ఏర్పాటు చేయాలని, జిల్లాల వారీగా సీనియారిటీ జాబితా విడుదల చేయాలని, పారదర్శక బదిలీ విధానాలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.

పై సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా నియమ నిబంధనలకు లోబడి నిరసన కార్యక్రమాలు చేపడతామని రాష్ట్ర కన్వీనర్ షేక్ అబ్దుల్ రజాక్, రాష్ట్ర సెక్రటరీ జనరల్ విప్పర్తి నిఖిల్ కృష్ణ, రాష్ట్ర చైర్మన్ షేక్ మొహమ్మద్ జానీ పాషా ప్రకటించారు.

## భారత్ హాకీ జట్టు ఆసియా కప్-2025 విజయంపై
# క్రీడా మంత్రి అభినందనలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** భారత హాకీ జట్టు ఆసియా కప్-2025లో చారిత్రక విజయం సాధించిన సందర్భంగా రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జట్టు సభ్యులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

మంత్రి మాట్లాడుతూ, జట్టు సభ్యులు మేజర్ ధ్యాన్ చంద్ స్ఫూర్తితో ముందుకు సాగి, ఎనిమిదేళ్ల తర్వాత భారత్ కు టైటిల్ సాధించడం ద్వారా జాతిని గర్వపడేలా చేశారని అన్నారు. ఈ విజయాన్ని యువ అథ్లెట్లకు స్ఫూర్తినిచ్చే మైలురాయిగా పేర్కొన్నారు.

క్రీడాకారుల కృషి, పట్టుదల, కనబరిచిన ప్రతిభ దేశ క్రీడా చరిత్రలో నిలిచిపోతుందని మంత్రి తెలిపారు. అంతకుమించి, భవిష్యత్తులో ప్రపంచ వేదికపై మరిన్ని విజయాలను సాధించాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## మున్సిపల్ పాఠశా మెరుగైన మౌలికసదుపాయాలు



- మంత్రి నాదెండ్ల మనోహర్

**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు మరింత ప్రాధాన్యతనిచ్చి మార్పులు తీసుకొస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.నెస్లీ సంస్థ సౌజన్యంతో, పట్టణంలోని కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిర బాలికోన్నత పాఠశాలలో, 6,గంగానమ్మపేటలోని తోటకూర సుబ్బారావు మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్లో 3, చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మూడు,మొత్తం 12,స్మార్ట్ టాయిలెట్స్,21లక్షల వ్యయంతొ ఏర్పాటు చేయగా, సోమవారం మంత్రి నాదెండ్ల మనోహర్, ఆమౌలిక సదుపాయాల ప్రారంభోత్సవ కార్యక్రమంలొ పాల్గొని, నెస్లీ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. అదేవిధంగా పురపాలక సంఘ నిధులతొ కోగంటి శివయ్య స్కూల్ అభివృద్ధి పనులకు, ఇరవై ఒక్క లక్షల రూపాయలు శాంక్షన్ చేసినట్లు, త్వరలోనె పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమాలలో వార్డు కౌన్సిలర్ మానస రెడ్డి, రావి భగవద్ దత్తు,తోటకూర వెంకటరమణారావు,నెస్లీ సంస్థ ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, స్కూలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# అభినవ జ్యోతిరావు పూలే చంద్రబాబు నాయుడు : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

- గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో సూపర్ సిక్స్ - సూపర్ హిట్, స్త్రీ శక్తి కార్యక్రమం విజయవంతం
- కదం తొక్కిన గుంటూరు పశ్చిమ నియోజకవర్గ నారీమణులు








**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ లో అభినవ జ్యోతిరావు పూలే చంద్రబాబు నాయుడు అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొనియాడారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సూపర్ సిక్స్ – సూపర్ హిట్, స్త్రీ శక్తి కార్యక్రమ మహిళా విజయవంతమైనది. తొలుత ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆర్టిసి బస్సులో ప్రయాణించి నల్లచెరువు కు చేరుకున్నారు. గుంటూరు నల్లచెరువు 3 బొమ్మల సెంటర్ నుండి ఏటుకూరు బైపాస్ వరకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి వేలాది మంది మహిళలతో కలసి భారీ ర్యాలీగా ముందుకు కదిలారు. ఈ ర్యాలీ మహిళలలో జోష్‌నింపింది. ఈ ర్యాలీకి ట్రాన్స్ జెండర్స్ కూడా భాగ మవ్వటం ఆకట్టుకుంది. అనంతరం వేలాది మంది మహిళలతో సభా వేదికకు చేరుకున్నారు.

సభా వేదిక పై సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నెల్లూరు కు చెందిన ప్రాసమణి ప్రసంగం ఆకట్టుకుంది. అదే విధంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందిన లబ్ధిదారులు తమ అభిప్రాయాలను పంచుకొని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే గళ్ళా మాధవి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమానికి మహిళలు పెద్ద ఎత్తున పోటెత్తి రావడం చూసి చాలా ఆనందంగా ఉంది. మహిళలు సాధికారత సాధిస్తేనే, దేశం అభివృద్ధి చెందుతుంది. ఏపీలో సూపర్ సిక్స్ లో 4 పథకాలు మహిళల కోసమే పెట్టారు. అది ఈ ఎన్డీయే కూటమి ప్రభుత్వంకు మహిళల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం. మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్న వ్యక్తులు చంద్రబాబు నాయుడు,పవన్ కళ్యాణ్,మోడీ అని చెప్పటంలో ఎటువంటి సందేహం లేదు. ఏపీ మహిళలు ఎన్డీయే కూటమి ప్రభుత్వంకు అండగా ఉంటారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆపరేషన్ సింధూర్ లో ఇద్దరు మహిళా కమాండోలతో విజయవంతం చేసి, స్త్రీ శక్తి ఎలా ఉంటుందో, ప్రపంచానికి చూపించారు. నాకోసం గుంటూరు పశ్చిమ నియోజకవర్గము మొత్తం ఈ రోజు నాకు అండగా నిలిచింది. వారికి రుణపడి ఉంటాను

మహమ్మద్ నసీర్ మాట్లాడుతూ...ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ప్రజలకి అండగా నిలిచింది. గళ్ళా మాధవి ఎమ్మెల్యే గా గెలిచిన నాటి నుండి అనేక కార్యక్రమాల ద్వారా ప్రజా సమస్యలు తీరుస్తున్నారు.

బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ... ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ కార్యక్రమం సూపర్ హిట్ అయ్యింది. ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు మహిళలకు అండగా నిలిచారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించిన ఘనత చంద్రబాబు దే అని ఎమ్మెల్యే కొనియాడారు.

పొడపాటి తేజస్వి మాట్లాడుతూ... ఎమ్మెల్యే గళ్ళా మాధవి సభకు మహిళలు ఇంత పెద్ద ఎత్తున పోటెత్తారు. మహిళలు తలుచుకుంటే ఏం జరుగుతుందో, స్త్రీ శక్తి అంటే ఏమిటో ఈరోజు చూపించారు. జగన్ రెడ్డి పాలనలో మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శ్రీ శక్తి అంటే ఎన్డీయే ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన గౌరవం, ఆస్తిలో సమాన హక్కు ఇచ్చిన పార్టీ తెలుగుదేశం. 1995 లో డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మహిళలకు స్వయంగా ఎదగటానికి అవకాశం ఇచ్చిన ఘనత చంద్రబాబు నాయుడు దే. 2024 ఎన్నికల్లో జగన్ రెడ్డి కి సినిమా చూపించిన వ్యక్తి పవన్ కళ్యాణ్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గం లో ప్రజలకు కష్టం వస్తే స్కూటీ మీద వచ్చి సమస్యలు పరిష్కరించే ఏకైక ఎమ్మెల్యే గళ్ళా మాధవి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు తిరుపతిరావు,జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, బోనయిన శ్రీనివాస్ యాదవ్, షేక్ సజ్జీల, నన్నపనేని రాజకుమారి, శనకాయల అరుణ,మాకినేని పెద్ద రత్తయ్య లు ప్రసంగించారు.

ఈ కార్యక్రమానికి శిల్పారామం కార్పోరేషన్ చైర్మన్ మంజుల రెడ్డి, వడ్రాణం హరిబాబు, సింహాద్రి కనకాచారి, టీడీపీ జనసేన కార్పొరేటర్లు మరియు ఎన్డీయే కూటమి పార్టీల రాష్ట్ర, పార్లమెంట్, అసెంబ్లీ నేతలు పెద్దయెత్తున పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467